# జ్ఞానగీత

Index | page no


| Index | page no |
|---|---|
| జ్ఞానగీత – 1 | 2 |
| జ్ఞానగీత – 2 | 11 |
| జ్ఞానగీత – 3 | 18 |
| జ్ఞానగీత – 4 | 26 |
| జ్ఞానగీత – 5 | 36 |
| జ్ఞానగీత – 6 | 44 |
| జ్ఞానగీత – 7 | 53 |

జ్ఞానగీత - 1

---

తన బిడ్డలు చేస్తున్న పని అధర్మమే అని తెలిసినప్పటికీ అతి మమకారంతో కళ్లుమూసుకుపోయిన ధృతరాష్ట్రుడు తన రథసారధియైన సంజయుణ్ణి ఇలా ప్రశ్నిస్తున్నాడు-

సంజయా! ధర్మక్షేత్రమైన కురుక్షేత్రములో జరుగుతున్న విశేషాలేమి? ఆ పుణ్యక్షేత్ర మహిమ వలన అన్నదమ్ములు సంధి చేసుకున్నారా? లేక యుద్ధానికే సంసిద్ధమైనారా?

సంజయుడు: యుద్ధానికే సిద్ధమైనారు మహారాజా!
మొదటగా కౌరవసేన యుద్ధభేరీలను మ్రోగించింది. అటు తరువాత తెల్లటి గుర్రాలతో కట్టబడి ఉన్న గొప్ప రథంలో ఉన్న కృష్ణార్జునులు తమ తమ శంఖాలను పూరించారు.

ఆ తర్వాత అర్జునుడు-
"కృష్ణా! ఈ రెండు సేనల మధ్య నా రథాన్ని నిలబెట్టు. అందరినీ ఒకసారి కలయచూడాలని ఉంది" అన్నాడు.

రథసారధియైన కృష్ణభగవానుడు అలానే చేశాడు. "అర్జునా! చూడు కురురాజులను" అన్నాడు.

అర్జునుడు తన పినతండ్రులను, పెద్దతండ్రులను, తాతలను, మేనమామలను, కొడుకులను, మనుమలను, తనకు మేలు చేసిన స్నేహితులను, తనకు చదువు చెప్పిన గురువులను, అందరినీ ఒక్కసారిగా కలయజూడగానే, కర్తవ్యనిష్ఠకు ఆటంకం కలిగించే మనోదౌర్బల్యం అయినటువంటి 'దయ' అనే దెయ్యం తనను ఆవహించింది.

అర్జునుడు: కృష్ణా! నా బంధువులను, ఆత్మీయులను చూసి నా గాండీవం జారిపోతోంది...

అపశకునాలు ఎదురవుతున్నాయి...
నా మనసు ఏదో కీడును శంకిస్తోంది...

యుద్ధంలో బంధువులను చంపి పొందే విజయంలో ఏం మేలును బావుకుంటాము? నేనెవరి కోసమైతే జీవించి వున్నానో, వారే నాతో యుద్ధానికై నా యెదుట నిలబడి వున్నారు.

త్రైలోక్యరాజ్యాన్నే గడ్డిపోచలా వదిలినవాణ్ణి. అలాంటిది ఈ భూలోకరాజ్యం కోసం నా వాళ్లను నేను చంపుకుంటానా? ఈ  కులనాశనం అయ్యే పాపకార్యం నుండి తప్పుకుంటే తప్పేమిటి?

వంశం నశిస్తే కులాచారాలు నశిస్తాయి...
కులాచారాలు నశిస్తే కులధర్మం నశిస్తుంది...
కులధర్మం నశిస్తే కులస్త్రీలు చెడతారు...
కులస్త్రీలు చెడితే వర్ణసాంకర్యం జరుగుతుంది...
వర్ణసాంకర్యం వలన సంఘవ్యవస్థ చెడుతుంది...
సంఘవ్యవస్థ చెడితే అందరూ అధోగతి పాలౌతారు...
ఇన్నిటికి కారణమైన యుద్ధమనే పాపకార్యానికి సంసిద్ధులమైనాము...
ఇంతకంటే దుర్యోధనుడి చేతిలో చావడమే నాకు మేలనిపిస్తోంది...

* * *

సంజయుడు: మహారాజా! ఈ విధంగా అర్జునుడు కలవరపాటుకు గురై ఏమీ తోచని అయోమయస్థితిలో ఆ రథంలోనే కూలబడ్డాడు.

* * *

మనసు కనికరంతోను కళ్లు కన్నీటితోనూ నిండిపోయిన అర్జునుణ్ణి చూసి కృష్ణుడికి నవ్వొచ్చింది.

కృష్ణుడు మనసులో ఇలా తలపోస్తున్నాడు-

"ఇంట్లో హాయిగా పడుకుని ఉన్న నన్ను తీసుకొచ్చి రథసారథిగా నియమించుకున్నాడు. ఇప్పుడేమో యుద్ధానికి జంకుతున్నాడు. కర్తవ్యాన్ని మఱచి, నీతిసూత్రాలు వల్లిస్తున్నాడు. నీతివేఱు, ధర్మం వేఱు. చంపడం అనే క్రియ తప్పే. కాని కరిచే పామును చంపడం ఒప్పే. కౌరవమూక కరిచే పాము. ఈ విషమూక వలన తన కుటుంబానికే కాదు; యావత్ రాజ్యానికే ప్రమాదం. ఈ దుష్టమూకను సమూలంగా నాశనం చేయవలసిందే."

అని తనలో తాను నిశ్చయించుకుని, ఆ దిశగా ప్రబోధాన్ని ప్రారంభించాడు శ్రీకృష్ణభగవానుడు.

ఓ అర్జునా!

క్షత్రియుడు తేలిగ్గా స్వర్గాన్ని పొందే మంచి అవకాశం యుద్ధం. యుద్ధానికి వెనుకాడితే స్వర్గప్రాప్తి చేజారటమే కాక, అపకీర్తిని కూడా మూటగట్టుకుంటావు. ఈ దుఃఖరూపమైన పిరికితనం నీకెట్లా దాపురించింది? ఈ యుద్ధసమయంలో 'దయ' అనే హృదయదౌర్బల్యాన్ని విడిచిపెట్టు. అర్జునా! ధైర్యంగా ఉండు. రా! యుద్ధం చెయ్యి...

అర్జునుడు: పూజ్యులైనటువంటి భీష్మద్రోణాదులతో నేనెట్లా యుద్ధం చేయను? వారిని చంపి, ఆ రక్తపుకూడు తినడం కంటే యుద్ధం మాని భిక్షాన్నం తినడం మేలు. పైగా గెలుపు వారిదో, మనదో తెలియదు. బంధుజన ప్రీతి వలన వారి యెడల విశేషమైన కారుణ్యం నన్ను ఆవహించింది. ఆ కారణంగా యుద్ధం చేయడమా? మానడమా? అనేది తేల్చుకోలేకపోతున్నాను.

నేను నీకు శిష్యుడను. శరణం కృష్ణా శరణం... నాకేది శ్రేయస్కరమో నీవే తేల్చి చెప్పు. నన్ను శాశించి నడిపించు."

అని ఊరక ఉండిపోయాడు.

* * *

సంజయుడు: మహారాజా! అర్జునుని అజ్ఞానానికి కృష్ణుని పరిహాసం కృష్ణుని పెదవుల్లో చిరుమందహాసమై వెల్లివిరిసింది.

కృష్ణభగవానుడు ఇలా పలికాడు-
అర్జునా! పెద్ద జ్ఞానిలా మాట్లాడుతున్నావు...

నీవు నిజంగా ఆత్మజ్ఞానివే అయివుంటే,
చచ్చినవారి గుఱించిగాని,
బ్రతికున్నవారి గుఱించిగాని
దుఃఖించి ఉండవు.
అదే గుర్తు నీవు జ్ఞానివి అనడానికి.

'నేను' అనే అహంస్వరూపం మహా సముద్రమైతే
నేను, నీవు, ఇతరులు అందరూ అందులో ఎగసిపడే కెరటాలవంటివారము.

కెరటం దృష్ట్యా మనమందరం అశాశ్వతులం.
సముద్రం దృష్ట్యా మనమందరం శాశ్వతులం.

నామరూపాల దృష్ట్యా మనం అనిత్యులం.
ఆత్మ దృష్ట్యా మనం నిత్యులం.

అప్పుడు-ఇప్పుడు-ఎప్పుడూ ఉంటాం.

అక్కడ-ఇక్కడ-ఎక్కడా ఉంటాం.

శరీరానికి బాల-యవ్వన-వృద్ధాప్యములు అనే మార్పులు సహజంగా ఉన్నట్లు జీవుడికి కూడా తన స్వస్థానమైన ఆత్మను చేరేవఱకు అనేక శరీరాల్లో(వాహనాల్లో) ప్రయాణించడం అనేది సహజంగా ఉన్నది.

ఇది తెలిస్తే-
తాను ఏ దశలో ఉన్నా
ఏ స్థితిలో ఉన్నా
ఏ నామరూపాలు ధరించి ఉన్నా
మోహం చెందడు.

* * *

ఈ దేహం, ఈ మనసు ఉన్నంతవఱకు శీతోష్ణ సుఖదుఃఖాలు తప్పనిసరిగా ఉంటాయి. తప్పదు. భరించాలి. వాటిని భరించడానికి సిద్ధపడితే, సుఖదుఃఖాల పట్ల సమభావం కలుగుతుంది. అట్టి సమభావం కలిగినవాడే నిజంగా ధీరుడు.

* * *

లేనిదానికి ఉనికి లేదు.
ఉన్నదానికి లేమి లేదు.
ఈ ఒక్క వాక్యం అర్థమైనవాడే నిజంగా జ్ఞాని.

* * *

దేని చేత ఈ ప్రపంచం ఏర్పడిందో అది నాశము లేనిది. కుండ నశిస్తుందేగాని మట్టి నశించదు కదా!

ఉండేది ఎప్పటికీ ఉంటుంది.
ఉండనిది ఎప్పటికీ ఉండదు.
కాబట్టి ఎట్టి ఇతరాలోచనలు లేకుండా యుద్ధానికి సిద్ధం కా.

* * *

ఆత్మ ఎవరినీ చంపదు.
ఎవరి చేతా చంపబడదు.

ఎందుకంటే-
ఆత్మ అనంతం.
ఆత్మకు అన్యం లేదు.
అది "ఉంటుంది" అంతే.

దానికి జననమరణాలు లేవు.
దానిలోనే దేశకాలాలు పుట్టాయి.

కాబట్టి-
అప్పుడు-ఇప్పుడు అనే పదాలుగాని
అక్కడ-ఇక్కడ అనే పదాలుగాని
ఆత్మవిషయంలో చెల్లవు.

మారుతున్న "ట్లు" కనబడే ఈ సకలానికి ఆధారంగా ఎప్పటికీ మారని తత్త్వం ఏదయితే ఉందో అదే ఆత్మ.

అర్జునా! ఈ విషయాన్ని నీవు గ్రహిస్తే-
"నేను వీరిని చంపుతున్నాను" అనే కర్తృత్వభ్రాంతి వీడుతుంది.

* * *

ధనవంతుడు ప్రతిరోజూ క్రొత్త దుస్తులను ధరిస్తాడు.
పేదవాడు తనకున్న ఒక జతనే ఉతికి జాగ్రత్తగా వాడుకుంటాడు.

అజ్ఞాని - పేదవాడు.
తనకున్నది ఈ ఒక్క దేహమే అని దేహభ్రాంతి కలిగి నిత్యం ఘర్షణ పడుతుంటాడు. మరణభీతితో తల్లడిల్లుతుంటాడు.

జ్ఞాని - ధనవంతుడు.
ఈ దేహం కాకుంటే మరొక దేహం అనే లెక్కలో దేహభ్రాంతి లేకుండా నిశ్చింతగా ఉంటాడు.

* * *

ఆకాశాన్ని అగ్ని కాల్చలేదు, నీరు తడుపలేదు. అంతే ఆత్మవిషయంలో కూడా... ఆత్మ నిత్యము, సర్వవ్యాపకము, నిశ్చలము, నిర్వికారము, సనాతనము.

* * *

ఇంద్రియాలకు, మనస్సుకు కారణమై ఇంద్రియాలకు, మనస్సుకు అందనిది ఆత్మ.

ఒకవేళ ఆత్మకు చావుపుట్టుకలు ఉన్నాయనే అనుకుందాం. అప్పుడు కూడా చింత అవసరం లేదు. పుడుతూ...చస్తూ...పుడుతూ...ఇలా సాగుతూ అయినా "ఉంటుంది" కదా!

ఈ "ఈశ్వరనియతి'ని నివారించడానికి వీలులేని విషయంగా గుర్తించినా సరే, మన మనస్సుకు స్థిమితం కలుగుతుంది. నిజానికి నశించడం అంటే, మూలరూపాన్ని పొందటమే. కుండ నశించడం అంటే మూలరూపమైన మట్టిగా మిగలడమే కదా!

ఆభరణాన్ని చెరిపితే మూలరూపమైన బంగారం శేషించినట్టు... జీవి చని-పోవడం అంటే, ఏకరూపమైన తన మూలంలోకి చేరిపోవడం.

* * *

ఆత్మను ఒకడు ఆశ్చర్యంగా చూస్తాడు.
(చూడబడేది ఆత్మ కాదు)

ఇంకొకడు ఆత్మ గుఱించి ఆశ్చర్యంగా చెబుతాడు.
(చెప్పబడేది ఆత్మ కాదు)

మరొకడు ఆత్మబోధను ఆశ్చర్యంగా వింటాడు.
(వినబడేది ఆత్మ కాదు)

నిజానికి ఆత్మ అనేది కేవలం అనుభవైక్య విషయం. అంతే. తియ్యదనాన్ని చూడలేం, చెప్పలేం, వినలేం కదా!

మాటకు మనస్సుకు వెనుక ఉంటుంది ఆత్మానుభవం అనేది. సమస్త జీవరాసుల్లో అహంస్వరూపంగా ఉన్న ఆత్మ ఎప్పటికీ నశించదు. కాబట్టి ఎవరి గురించీ దిగులుపడవలసిన అవసరం లేదు.

అధర్మపరులను నాశనం చేయడం అనేది క్షత్రియధర్మం.

జయిస్తే ధర్మం నిలబడుతుంది.
మరణిస్తే స్వర్గం లభిస్తుంది.

ఈ రెండుమార్గాలు వినా నీకు ఇక వేరే మార్గమే లేదు. కాబట్టి సుఖదుఃఖాల యెడల, లాభనష్టాల యెడల సమభావం కలిగి యుద్ధానికి సిద్ధం కా. అటువంటి యుద్ధం వలన పాపం రాదు.

అసలు ఏ కర్తవ్యమూ, ఏ ప్రయత్నమూ లేకుండా ఉండడమే పాపము. ప్రయత్నమే జీవం జీవికి. ప్రయత్నంలో ఒక్కోసారి ఆటంకం కలిగితే కలగనీగాక. అసలు, లక్ష్యమే చేరకుందముగాక. అయితే ఏం? ప్రయత్నమే నీ కర్తవ్యం.

'ఫలితం నీకు అనవసరం' అంటే ఫలితాన్ని అనుభవించకూడదు అని కాదు; ఫలితం కోసం ప్రయత్నం వద్దు అనేదే.

ప్రయత్నమే ఫలం కర్మయోగికి.
ప్రయత్నం వలన  ఫలం కాదు.

ఫలాసక్తి వలన ప్రయత్నం బంధహేతువవుతుంది.
ఫలాసక్తి లేని ప్రయత్నం మోక్షకారకం అవుతుంది. ఫలాసక్తి ఎప్పుడైతే ఉండదో, అప్పుడు కర్మల పట్ల సమభావం కలుగుతుంది. ఆ సమభావానికే 'యోగం' అని పేరు.

* * *

బాటసారులకు నీడనివ్వాలని చెట్టు అనుకోదు.

ప్రజల దాహం తీర్చాలని నది ప్రవహించదు.

అవి వాటి వాటి సహజస్వభావాలు అంతే.

యుద్ధం చేయడం అనేది క్షత్రియ స్వభావం.

నీవు చేసి తీరుతావు. ఈ వైరాగ్యం నీకు తాత్కాలికమే. ఈ క్షణికవైరాగ్యంతో సన్న్యాసివై అడవికి వెళ్లినా సరే, అక్కడ మృగాలను చంపుతావు. అధర్మపరులు మృగాలతో సమానం. చంపడమేదో వీరినే చంపు. ధర్మమైనా నిలబడుతుంది లోకంలో. కర్మనైపుణ్యం అంటే ఇదే. స్వభావాన్ని మంచి కర్మల వైపుకు త్రిప్పడమే కర్మనైపుణ్యం. నీ పాటికి నీవు నీ ధర్మాన్ని ఆచరిస్తూ పోతుంటే, యాంత్రికంగా కర్మఫలం కూడా గొప్పగా విడుదలై అది లోకంలో అందరికీ సరాసరిన పంచబడుతుంది. కాబట్టి నీ పనిని నీవు చేస్తూపోతున్నట్లైతే, ఏకకాలంలో లోకసేవ కూడా చేస్తున్నట్లే అవుతుంది.

ఫలాల మీద దృష్టి లేకుండా చేసే కర్మల పట్ల ఉన్న ఆ నేర్పరితనానికే 'యోగం' అని పేరు.

* * *

## జ్ఞానగీత - 2

---

అర్జునుడు: కృష్ణా! నిష్కామకర్మ వలన సమాధి(సమబుద్ధి) కలిగినవాని స్థితి ఎలా ఉంటుంది? వాని యొక్క ఆచరణాత్మకమైన విధానం ఎలా ఉంటుంది?

భగవానుడు: మొదట్లో ప్రయత్నపూర్వకంగా సంకల్పాలను విడిచినట్లు కనిపిస్తుందేగాని, ఆ తర్వాత అప్రయత్నంగా ఎట్టి సంకల్పాలు లేకుండానే, ఆత్మస్థితిలో నిలకడ కలిగి ఉండే స్థితి కలుగుతుంది. అలా ఆత్మస్థితిలో సంస్థితమై ఉన్నవాణ్ణే "స్థితప్రజ్ఞుడు" అని అంటారు.

స్థితప్రజ్ఞుడు అంటే తానున్న చోటులో తానుండడం.

* * *

ఆసక్తే ప్రధాన ఆటంకం సాధకునికి.
ఆసక్తి వలన కోరిక.
కోరిక వలన కోపం.
కోపం వలన అవివేకం.
అవివేకం వలన అస్థిమితం.
అస్థిమితం వలన బుద్ధి నాశనం.
బుద్ధి నాశనం వలన జీవితం సర్వనాశనం.
కాబట్టి సర్వనాశనానికి తొలిబీజం అయిన ఆసక్తి.
అలాంటి ఆసక్తిని వదిలి యుద్ధం చేయి.

* * *

అనాసక్తి వలన శుద్ధ మనస్సు.
శుద్ధ మనస్సు వలన స్థిరబుద్ధి.
స్థిరబుద్ధి వలన ఆత్మయందు ప్రవేశం.
ఆత్మ యందు ప్రవేశం సర్వదుఃఖ నివారణం.

* * *

అజ్ఞానికి ఏది రాత్రో జ్ఞానికి అది పగలు.

అజ్ఞానికి ఏది పగలో జ్ఞానికి అది రాత్రి.

అనగా-

జ్ఞానులకు తెలిసిన స్వరూపం,

అజ్ఞానులకు తెలియదు.

అజ్ఞానులకు తెలిసిన ప్రపంచం,

జ్ఞానులకు తెలియదు.

* * *

ఆత్మనిష్ఠ వలన మోహం నశిస్తుందా?

మోహనాశం వలన ఆత్మనిష్ఠ కలుగుతుందా?

అన్న విచారణ వదిలి, ఈ రెంటిలో నీ సంస్కారానికి ఏది అనుకూలమని, సులభమని అనిపిస్తుందో ఆ త్రోవనే వెళ్లి ముక్తుడవు కా.

అర్జునుడు: కృష్ణా! నీ మాటల్ని బట్టి కర్మ కంటే జ్ఞానం గొప్పది అని తెలుస్తోంది... మరి నన్నెందుకు కర్మ వైపుకు మళ్లిస్తున్నావు? నన్ను తికమక పెట్టక, కర్మా? లేక జ్ఞానమా? ఈ రెంటిలో నాకు ఏది శ్రేయస్సో చెప్పు.

భగవానుడు: అర్జునా! రెండూ శ్రేష్టమైనవే. వారి వారి సంస్కారాన్ని బట్టి ఆయా యోగాల్ని ఎన్నుకొంటారు. ఎవరూ నియమించరు.

ఆత్మస్థితిని-

ప్రయత్నపూర్వకంగా పొందేవాడు - కర్మయోగి.

అప్రయత్నంగా పొందేవాడు - జ్ఞానయోగి.

కర్మ - అనుష్ఠానం. జ్ఞానం - అనుభవం.

కర్మ - మార్గం. జ్ఞానం - గమ్యం.

అర్జునా! నీ స్వభావం కర్మ చేయడం.

అందుకే క్షత్రియుడుగా యుద్ధం చేయడం నీ ధర్మం.

అందుకే యుద్ధం చేయి...

కర్మ వలన ఎలాంటి లాభనష్టాలు వస్తాయి? అనే ఊహాగానాలు మాని, నీకు జన్మతః నిర్దేశించబడిన కర్మలను చేసుకుంటూ వెళ్లిపో...అంతే.

కర్మలో అకర్మ అంటే ఇదే. అకర్మకే జ్ఞానం అని పేరు. జ్ఞానమనేది ప్రత్యేకమైన వస్తువు కాదు. శుద్ధకర్మయే, శుద్ధభక్తియే, జ్ఞానము.

* * *

"నేను తింటున్నాను" అని తినేవాడు తినేది అన్నాన్ని కాదు; పాపాన్నే.

"తన లోపలున్న పరమాత్ముడికే పెడుతున్నాను" అని తినేవాడు తిన్నది అన్నం కాదు; ప్రసాదమే.

అటువంటి భగవదర్పిత ఆహారం వలన తన శరీరం, మనసు అమృతమయమవుతాయి.

* * *

కర్మ(యజ్ఞం) వలన వర్షం...

వర్షం వలన అన్నం...

అన్నం వలన వీర్యం...

వీర్యం వలన జీవకోటి...

ఏర్పడుతున్నాయి...

కాబట్టి అర్జునా! ప్రపంచం నడవడానికి కర్మ(ధర్మ)చక్రం అత్యంత అవసరం. అనంతకాలంగా నడుస్తున్న ఈ ధర్మచక్రానికి ఎవడు అడ్డు తగులుతాడో, వాడు మహాపాపి. వాణ్ణి అంతం చేయవలసిన బాధ్యత క్షత్రియుడైన నీకే ఉన్నది.

ధర్మచక్రం నడవడానికి ఎవడు దోహదపడతాడో వాడు అవతారమూర్తి. ప్రస్తుతం నేను అటువంటి పాత్రను నిర్వహిస్తున్నాను అర్జునా! నీకు సారధినై ప్రకృతికి, పరమాత్మునికి వారధినై నిన్ను పరమపదానికి చేర్చడానికి నేను ఈ రథాన్ని పూనాను. రథాన్ని అధిరోహించి యుద్ధానికి పూనుకో.

* * *

ఎవడు తనలో తానే ఆనందిస్తాడో

ఎవడు తనతో తాను తృప్తి పడతాడో

అట్టివాడు చేయదగిన కార్యం ఏమీలేదు లోకంలో.

అట్టి ఆత్మారామునికి కర్మ చేయాలనిగాని, చేయకూడదనిగాని అతనిలో ఏ ఘర్షణా ఉండదు. అతడు కర్మ చేసినా చేయనట్టే. చేయక ఊరకున్నా చేసినట్టే. ఇదమిత్థంగా అతని స్థితి ఇది అని నిర్ణయించే శక్తి దేవతలకు కూడా లేదు.

కాబట్టి అటువంటి జ్ఞానస్థితిలో నీవుండి యుద్ధం చేయి.

* * *

జనకుని వంటి జ్ఞాని కూడా 'నిష్కామకర్మ' అనే సాధనంతోనే ముక్తిని పొంది వున్నాడు.

ఉత్తములు దేనిని ఆచరిస్తే, సామాన్యులు కూడా దానినే ఆదర్శంగా తీసుకుంటారు.

ఉత్తములు దేనిని ప్రమాణంగా తీసుకుంటారో, సామాన్యులు కూడా దానినే ప్రమాణంగా తీసుకుంటారు.

ఉదాహరణకు నన్నే చూడు. నాకు కర్మ చేయవలసిన అగత్యం లేదు. కర్మయందే ప్రవర్తిస్తున్నాను. నలుచదరంగా ఉన్న చక్రాలను కలిగిన రథాన్ని ఎంత గొప్ప గుఱ్ఱాలైనా లాగలేవు. కర్మాచరణ విషయంలో నేను కదలక ఉంటే, సామాన్యులు కూడా నిత్యనైమిత్తిక కర్మలు చేయక చెడిపోతారు. లోకం స్తంభించిపోతుంది. పరోక్షంగా ఆ పాపానికి నేనే బాధ్యుణ్ణవుతాను.

కర్మఫలం మీద ఆసక్తి లేకుండా లోకక్షేమం కొఱకు మాత్రమే కర్మలు చేస్తుండడం ఉత్తముని లక్షణం.

కర్మ - బయటి విషయం.
జ్ఞానం - లోపలి విషయం.

జ్ఞానంలో జీవించు.
కర్మలో చరించు.

* * *

అజ్ఞానం అంటే తన ధర్మం తనకు తెలియకపోవడం. అంతేగాని పరధర్మం తెలియకపోవడం కాదు.

నీ ధర్మం ఏదో నీకు తెలిస్తే చాలు. అదే జ్ఞానం. పరధర్మంతో నీకు పనిలేదు. ఇతర ధర్మాలతో పోల్చవద్దు. అది వీలు కాదు; అవసరమూ లేదు.

నీటి కంటే నెయ్యి గొప్పదే, అలా అని చేప నీటిని వదిలి, నేతిలో జీవించగలదా? నీటిలో ఉండడమే చేపకు స్వధర్మం. పరధర్మం భయంకరమైనది.

అర్జునా! వర్ణాశ్రమధర్మాలను క్రమబద్ధం చేయడమే క్షత్రియధర్మం. అందుకు యుద్ధం అనివార్యమైతే, తప్పదు చేయవలసిందే. ఎవడి వాకిలి వాడు ఊడ్చుకుంటే, ఊరంతా శుభ్రమౌతుంది. ఎవడి ధర్మాన్ని వాడు పాటిస్తే లోకమంతా సుభిక్షంగా ఉంటుంది.

అర్జునుడు: కృష్ణా! నాకొక సందేహం... ఒకడు పాపకార్యం వైపుకు లాగబడుతున్నాడూ అంటే, అది దేని ప్రేరణ? ఆ శక్తి ఏమి?

భగవానుడు: ఆ విపరీతశక్తి ఏదో కాదు, మన మనసులో పుట్టే కోరికే అది. మేఘం చేత సూర్యుడు, పొగ చేత నిప్పు, మురికి చేత అద్దము, మావి చేత శిశువు కప్పబడి ఉన్నట్లు, కోరిక చేత జ్ఞానము కప్పబడి ఉంది.

ఈ 'కోరిక' యొక్క శక్తి అంతా ఇంతా కాదు. సముద్రంలోని అలలకైనా అంతం ఉందేమోగాని, కోరికలకు అంతూ పొంతూ ఉండదు. ఇదే చివరి కోరిక అనడానికి అసలు వీలే లేదు. కోరికలను తీర్చడం అనేది నేతితో అగ్నిని ఆర్పాలనుకోవడం లాంటిదే. పెరగడమేగాని, తరగడం ఉండదు.

కోరికను జయించడానికి ఏకైక మార్గం- కోరికను వదిలిపేయడమే. స్వధర్మ నిష్ఠాపరుడికి కోరిక ఉండదు.

కోరిక ఉంది అంటే, స్వధర్మాచరణలో ఏదో లోపం ఉన్నట్టే. కోరవలసిన అవసరమే రాదు ధర్మాత్ముడికి.

'ఇది వద్దు', 'అది కావాలి' అనేదే మహాశత్రువు. నిజానికి నీవు చేసే యుద్ధం కామక్రోధాదుల పైనే. కౌరవుల మీద కాదు. అర్జునా! లే యుద్ధానికి...

* * *

## జ్ఞానగీత - 3

---

ఏకంగా ఉన్న తాను అనేకం అవ్వాలని సంకల్పించాడు భగవంతుడు.

అదే తొలి కదలిక(కర్మ) అయ్యింది.

ఆ సంకల్పం ఘనమై విశ్వమై అనంతంగా విస్తరిస్తోంది.
మళ్లీ ఆ విస్తరణ తిరుగుముఖమై, కేంద్రమైన భగవంతునిలో లయం అయిపోతుంది.

కర్మ అనేది సృష్టి విస్తరణకు దోహదం చేస్తుంది.
జ్ఞానం అనేది కేంద్రం వైపుకు దారి చూపెడుతుంది.

బాహ్యంలో సృష్టిని(అనేకత్వాన్ని) అనుభవించాలి.
ఆంతరంలో మూలాన్ని(ఏకత్వాన్ని) అనుభవించాలి.
ఇదే సకల జ్ఞానసారం.

ఈ జ్ఞానసారాన్ని తొలి యుగం నుంచి గురువుల రూపంలో(ఇప్పుడు కృష్ణుని రూపంలో) ప్రబోధిస్తున్నాడు భగవంతుడు.

మొట్టమొదటగా సూర్యుడికి బోధించాడు.
సూర్యుడి రూపంలో ఉండి వైవస్వత మనువుకి ప్రబోధించాడు.
వైవస్వత మనువు యొక్క రూపంలో ఉండి ఇక్ష్వాకు మహారాజుకు ప్రబోధించాడు.

అర్జునా! ఇప్పుడు ఈ (కృష్ణ) రూపంలో ఉండి నీకు ఈ జ్ఞానగీతను ప్రబోధిస్తున్నాడు.

నిజానికి ఈ జ్ఞానగీతకు మొదటి శ్రోతను నేను. అర్జునా! రెండవశ్రోతవు నీవు.

ఈ జ్ఞానం చాలా శ్రేష్ఠమైనది, రహస్యమైనది.
రహస్యమైనది అంటే నిగూఢమైన తత్త్వము కలిగినది అని అర్థం. అది కేవలం గురు పరంపరానుగతంగా మాత్రమే అవగతం అయ్యే తత్త్వం కాబట్టి రహస్యమని అన్నారే తప్ప ఇతరులకు చెప్పరానిది అని కాదు.

సృష్ట్యాది నుండి అందరి గురువుల రూపంలో ఉండి బోధించింది "నేనే"(పరమాత్ముడే). నీ గత జన్మలన్నీ నాకు తెలుసు. బంగారు గొలుసును చెరిపి, ఉంగరం చేయిస్తే ఉంగరం యొక్క గతజన్మ గొలుసు అన్నట్టు ఈ జన్మలన్నీ.

నీవు, నేను ఒకే ఆత్మపదార్థము నుండి పుట్టినవాళ్లము. ఎన్ని రూపాలు(జన్మలు) మారినా, మన ఆధారతత్త్వం ఎన్నటికీ మారదు.

ఆ ఆధారతత్త్వాన్ని తెలుసుకున్నంతమాత్రాన పునర్జన్మ ఉండకపోదు; మళ్లీ పుట్టకపోడు. కానీ దానిని మాత్రం 'పుట్టడం' అనరు. 'అవతరించడం' అంటారు అలాంటి వారిని. అర్జునా! నేను అలా అవతరించాను ఈ భూమ్మీద.

భూత-వర్తమాన-భవిష్యత్తులనేవి నా కళ్లెదుటే పుట్టి, ప్రాకి, నశించిపోయే క్రిములు లాంటివి. నేను కాలాతీతుడను.

* * *

లోకంలో అధర్మం పెరిగినా, తగ్గినా దానిని సమతుల్యం చేయడానికి "నేను" అవతరిస్తుంటాను నామరూపాలతో.

* * *

ఒకప్పుడు నా భక్తుడైన ప్రహ్లాదుని నిశ్చలధ్యాన ప్రభావం వలన రాక్షస రాజ్యమంతా ప్రశాంతంగా మారిపోయింది. ఒక విధమైన స్తబ్ధత ఏర్పడింది. కలహాలు లేవు, యుద్ధాలు లేవు, యజ్ఞభంగాలూ లేవు.

దేవతలకు బొత్తిగా పనిలేకుండా అయిపోయింది.
లోకం చైతన్య హీనమైన పరిస్థితుల్లో చిక్కుకుంది.
నేనప్పుడు సూక్ష్మ రూపంలో ప్రహ్లాదుని హృదయంలోకి దూరి
చిత్తమును చెదిరేటట్లు చేసి తపోభంగం కలిగించాను.
మళ్లీ లోకంలో యధావిధిగా పరిస్థితులు తయారై అలజడి మొదలయ్యింది.

సృష్టి క్రమం అనేది నాకొక క్రీడ. అంతే.
అంతకు మించి దీనికి ఏ ప్రత్యేక ప్రయోజనమూ లేదు. ఉన్నత ఉద్దేశాలూ లేవు.
ఇదొక ఆట అంతే.

ఈ ఆట ఆగిపోయే పనిని ఎవరు చేసినా నేనూరుకోను.

నా క్రీడలో సన్మార్గులకూ, దుర్మార్గులకు సమానమైన చోటు ఉంది.
అప్పుడే సృష్టి రంజకంగా ఉండేది.

నా ఈ తత్త్వాన్ని ఎవడైతే తెలుసుకుంటాడో
వాడు, నేను అభిన్నులం. మా ఇద్దరికీ ఏ తేడా ఉండదు.

సృష్టికర్తను నేనే అయినప్పటికీ, సృష్టించిన సంగతి మరపుకు రావడంగానీ, అయోమయస్థితిగాని నాకు ఉండవు. ఆ కారణం చేత నేను కర్తను అయినప్పటికీ నేను "అకర్త"నే. కర్మలు నన్నంటవు. ఎందుకంటే కర్త-కర్మ-క్రియ నేనే కాబట్టి.

ఈ విషయం నీకు అర్థమైతే నీవు కర్మఫలానికి కట్టుబడక కేవలం కర్మ(ధర్మ)నిష్ఠలో ఉంటే, నీవూ "అకర్త"వే.

ఏది ప్రాప్తమో దానిని భగవత్ప్రసాదంగా స్వీకరిస్తూ జీవనం సాగించేవాడు జ్ఞాని.
వాడు కర్మబద్ధుడు కాడు.

చంపడం పాపమే కానీ చంపడం అనే క్రియకు ధర్మం తోడైనప్పుడు అది యజ్ఞంగా మారుకుంటుంది.

ధర్మం తోడైన అర్థము(సంపద) వలన
ధర్మం తోడైన కామము(కోరిక) వలన
మోక్షం కలుగుతుంది.

మన సనాతన సంప్రదాయంలో-
కర్మ అంటేనే ధర్మంతో కూడిన కర్మ అనే అర్థం.
ధర్మంతో కూడిన ప్రతి కర్మా ధర్మనిష్ఠకు దారితీస్తుంది.

కర్మ అనేది సాధన.

జ్ఞానం అనేది సిద్ధి.

కర్మనైపుణ్యం కలగాలన్నా
జ్ఞానసిద్ధి కలగాలన్నా
సద్గురువును ఆశ్రయించాలి.
వారి అనుగ్రహం కోసం కనిపెట్టుకుని ఉండాలి.
"ఓర్పు-శ్రద్ధ" విషయంలో నీకు పరిపక్వత కలిగినప్పుడు నీకు జ్ఞానాన్ని అనుగ్రహిస్తాడు.

ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయడు.
ఆలస్యం అవుతోందంటే అది నీ శ్రద్ధలో లోపమే.

ఏ జ్ఞానాన్ని తెలుసుకుంటే ఇక తెలుసుకోవడం అనే క్రియ ఆగిపోతోందో అటువంటి పరమార్థజ్ఞానాన్ని సద్గురు సన్నిధికి చేరి తెలుసుకో.

సముద్రమంత పాపరాశి ఉన్నా సరే జ్ఞానమనే పడవ సహాయంతో పరమపదం అనే తీరాన్ని తేలిగ్గా చేరగలవు.

కర్మ చేసినా చేయనట్టు, చేయకపోయినా చేసినట్టు నీకు ఎప్పుడైతే అనుభవంలోకి వస్తుందో అప్పుడు నీకు జ్ఞానబోధ అవగతం అయినట్టు. కర్మరహస్యం తెలిసినట్టు.

* * *

జ్ఞానం కన్నా  పవిత్రమైన వస్తువు మరొకటి లేదు.
ఎందుకంటే దానిని అపవిత్రం చేయడానికి దానికి అన్యవస్తువు లేదు.

సమస్త వస్తువులు, సమస్త కర్మములు

జ్ఞానంలోనే పుడతాయి, ఉంటాయి,

జ్ఞానంలోనే కలగలిసిపోతాయి.

అటువంటి జ్ఞానం సద్గురు సన్నిధిలో తప్ప మరెక్కడా దొరకదు.

దేవుణ్ణయినా సంశయించు.

గురువును సంశయించకు.

నన్ను చూడు. నేనొక పశువులకాపరిని.

తోటి సావాసగాళ్లతో చేరి అల్లరిపనులు చేసినవాణ్ణి.

అలాంటి నన్ను జగద్గురువుగా తీర్చిదిద్దారు సాందీపని మహర్షి.

నేను పుట్టుకతోనే జ్ఞానస్వరూపుణ్ణి.

అయినప్పటికీ ప్రపంచంలోకి ప్రవేశించాక, ప్రపంచ సంస్కారాలు చుట్టుముట్టడం సహజం. మళ్లీ ఆ సంస్కారాలు ప్రక్కకు త్రోసి స్వరూపాన్ని జ్ఞప్తికి తెచ్చేవాడు గురువు.

ఆ స్వరూపంలో, ఆ జ్ఞానంలో, ఆ జ్ఞప్తిలో సదా నేను స్థిరంగా నిలబడేటట్టు అనుగ్రహించారు మా గురుదేవులు.

పైగా గురు-శిష్య సంప్రదాయం కొనసాగడానికైనా గురుసాంగత్యం అవసరమయ్యింది నాకు. అటువంటి మహత్తరమైన గురుశిష్య పరంపరలో నీవూ ఒకడివి.

తరువాత తరం వారికి ఆదర్శంగా ఉండేటట్లు నీవు ధీరుడవై ధర్మాన్ని అనుసరించు.

లే! యుద్ధానికి.

అర్జునుడు: కృష్ణా ఒకవైపు కర్మను వదిలేయమంటున్నావు. మరో వైపు ఏ కోరికా లేకుండా ఉత్తినే కర్మ చేయి అంటున్నావు. ఈ రెంటిలో నాకేది శ్రేయస్సో నువ్వే తేల్చి చెప్పు.

శ్రీకృష్ణ భగవానుడు: అర్జునా! రెండూ మంచివే. ఒకటే చెప్పమంటే మాత్రం నిష్కామ కర్మే మంచిదంటాను. ఎందుకంటే, కర్మ చేయడం ప్రతి జీవి సైజం. శ్వాస పీలుస్తూ వదలడం కూడా కర్మే కదా! బండరాయి లాంటి జడవస్తువులు కూడా కర్మలో భాగస్వామ్యులే. బండరాయి బాటసారులు కూర్చోవడానికి అవకాశం ఇస్తోంది కదా! అదీ ఓ కర్మే. ఆ బండయే శిల్పికి అందమైన శిల్పాన్ని చెక్కడానికి ఆసరా అయ్యింది కదా! అదీ ఓ కర్మే.

జడపదార్థాలే కర్మలో భాగస్వామ్యులు అయినప్పుడు చైతన్యరూపుడివైన నీవు కర్మ చేయక పడి ఉండడం నీకు తగునా? కాబట్టి కర్మ చేయక ఉండడం కంటే (నిష్కామ కర్మ) చేయడమే శ్రేష్ఠమని నా అభిమతం.

లే! యుద్ధానికి కదులు.

* * *

ఎవడు రాగద్వేషాలు లేక జీవిస్తాడో వాడు సంసారి అయినా సరే, వాణ్ణి "నిత్యసన్యాసి" అని చెప్పవచ్చు. నిజానికి కర్మను వదిలినవాడు, ఫలాపేక్ష లేకుండా కర్మ చేసేవాడు ఇద్దరిస్థితీ ఒక్కటే. ఇద్దరూ జ్ఞానఫలాన్ని పొందుతారు.

కాబట్టి నేను చెప్పేదేమంటే,

వెలుపల కర్మ చేయి...

లోపల బురద అంటని పద్మంలా, స్వచ్ఛంగా ఉండు.

కర్మ చేయనివాని కంటే
కర్మ చేసేవాడే త్వరగా బ్రహ్మపదాన్ని పొందుతాడు.

రథం వేగంగా ప్రయాణిస్తున్నప్పటికీ
రథికుడు కదలక కూర్చొని ఉన్నట్టు

నీవు యుద్ధం చేస్తూ కూడా
యుద్ధం చేయని స్థితిలో నీవుండాలి.
అదే కర్మలో అకర్మ అంటే.

స్వతఃగా తోలుబొమ్మకు ప్రాణం లేదని తెలిసినా కూడా జనులు వినోదంగా అందులోని కథను ఆస్వాదిస్తున్నట్టు, జ్ఞాని తన జడశరీరాన్ని కూడా అట్లే విడిగా ఉండి, చూస్తూ ఆస్వాదిస్తుంటాడు.

'నేను చూస్తున్నాను' అని అనడు.
'ఇది చూస్తోంది' అని ఉంటాడు.

'నేను ఆలోచిస్తున్నాను' అని అనడు.
'ఇది ఆలోచిస్తోంది' అని ఉంటాడు.

* * * *

కర్మ చేస్తూనే కర్మ చేయని స్థితిలో తానుండాలంటే తనకెంత బుద్ధికుశలత ఉండాలి! అట్టి బుద్ధి కుశలత సద్గురువు యొక్క అనుగ్రహం వలన మాత్రమే లభిస్తుంది; రామునికి వశిష్ఠుని వలన లభించినట్లు.

* * *

జ్ఞానగీత - 4

---

నిజానికి జీవులను ఆడించేది భగవంతుడు కాదు. మనిషిలో మనస్సున్నట్టు భగవంతునిలో అభిన్నంగా ఉన్న ప్రకృతియే(మహామాయే) ఈ కార్యకారణ సంబంధాలకు కారణమై ఉన్నది.

కారణము ఒక ఘటన.

కార్యము మరొక ఘటన.

అవి రెండూ విడి విడి భాగాలు.

కానీ "ఈ కార్యానికి ఇది కారణం" అని కార్యకారణాలను కలిపి చూపిస్తుంది మహామాయ.

తత్ఫలితంగా- 'కారణం లేకుండా కార్యం జరుగదు' అనే నిశ్చితాభిప్రాయానికి వచ్చేశాం.

కాబట్టే 'సాధన వలన మోక్షం' అనే తప్పుడు అభిప్రాయం ఏర్పడింది లోకంలో.

నిజానికి సాధనకి, మోక్షానికి సంబంధమే లేదు. అనే విషయం తెలుస్తుంది మోక్షంలో.

కర్మ లేకపోతే ఉండేది మోక్షమే.

కర్మ లేకుండా చేసుకోవడం కూడా కర్మే కదా! అంటావేమో...కాదు. ఇదొక్కటి మాత్రం కర్మే అయినా కర్మ కాదు.

బాటసారి మోసే అన్నపుమూట బరువు అన్నమాటేగాని, భోజనం వేళకు తనకు ఆకలి తీర్చి, శ్రమను తొలగించి, శక్తినిస్తుంది. బరువూ తొలగుతుంది.

అలా కాకుండా కర్తృత్వభావనతో కర్మలు చేశావనుకో...అది రాళ్లమూట వంటిది. పోయే కొద్దీ బరువూ పెరుగుతుంది. శ్రమా పెరుగుతుంది. శక్తి నశిస్తుంది. ఆకలీ తీరదు.

* * *

తోలుబొమ్మ ఎంత అందంగా ఉంటే మాత్రం దానిని పెళ్లి చేసుకోవాలని ఎవడైనా అనుకుంటాడా?

కర్మ అనేది ఓ జడ వస్తువు అని తెలుసుకున్నాక ఎవడైనా కర్మబంధంలో చిక్కుకుంటాడా?

కర్మ అనేది పడవ లాంటిది. తీరం చేరేవరకే దానితో పని. తీరం చేరుకున్నాక పడవను ఎవడూ ఇంటికి మోసుకెళ్లడు.

ఏ అవకాశం లేని ఏకాత్మస్థితికి(అకర్మకు) చేరేవరకే కర్మ. ఆ చరమదశలో కర్మబంధం దానికదే వీడిపోతుంది. కర్మ జడవస్తువు. కర్మఫలప్రదాత భగవంతుడు.

భగవంతునికి సంపూర్ణ శరణాగతి చెందాలి. అప్పుడే నీ ప్రతి కర్మా లోకకళ్యాణానికే దారి తీస్తుంది. కర్త తానని కర్మ చేయడమే పాపం. కాబట్టి అర్జునా! నీవు నా చేతిలో ఉన్న ఒక ఆయుధం లాంటివాడివి.

"అర్జునుడు" అనే ఆయుధంతో ఈ అధర్మపరులను నిశ్శేషంగా హతమార్చడానికే నేను అవతరించాను. నీవు కేవలం నిమిత్తమాత్రుడివి. కర్తృత్వభావన వదిలి యుద్ధం చేయి.

* * *

పరమాత్మును యందే మనసు నిలపాలి.

దాని పట్ల ఆర్తిని, భక్తిని కలిగి ఉండాలి.

అప్పుడు మోక్షం సులభం.

మోక్షమంటే ఏదో అనుకోవద్దు. "ఆత్మనిష్ఠ" నుండి జారకుండా ఉండడమే మోక్షం.

సదా ఆత్మనిష్ఠలో ఉన్నవానికి-

వేదబ్రాహ్మణుడైనా ఆత్మే.

గోవు అయినా ఆత్మే.

ఏనుగైనా ఆత్మే.

కుక్క అయినా ఆత్మే.

కుక్క మాంసం తినే ఛండాలుడైనా ఆత్మే.

ఇలాంటి ఆత్మబుద్ధితో ఉన్నవాణ్ణే పండితుడు అనాలి. కేవలం శాస్త్రపరిచయం ఉన్నవాడు పండితుడు కాడు.

ఆత్మనిష్ఠయే సకలశాస్త్రసారం.

ఆత్మనిష్ఠుడే నిజమైన పండితుడు.

* * *

ఎవడు ఫలితాన్ని ఆశించక కర్మ కొఱకే కర్మ చేస్తాడో వాడు కర్మ చేయనివాడే అవుతాడు. కర్మను వదలి ఊరక ఉన్నంతమాత్రాన వాడు యోగి కాజాలడు.

యోగి అంటే కర్మరహితుడు అని కాదు;

సంకల్పరహితుడు అని అర్థం.

విషయాల పట్ల ఆసక్తి లేనివాడే నిజంగా యోగి.

* * *

సంకల్పాలు చేసే మనసే తనకు శత్రువు.
సంకల్పాలు లేని మనసే తనకు మిత్రుడు.

* * *

ప్రతీది భగవత్సంకల్పమే అయినప్పుడు
జీవుడు చేసే ప్రతి పనీ, ప్రతి తలంపూ
భగవత్సంకల్పంలో భాగమే కదా!

అని దృఢ నిశ్చయంతో చేసే ప్రతి పనీ, ప్రతి తలపూ పవిత్రమైన యజ్ఞంతో సమానమవుతాయి.

నది ఎన్ని మలుపులతో ప్రవహించినా చివరికి చేరేది సముద్రానికే అన్నట్లు, భగవదర్పణం చేసినవాని జీవితం కూడా అలా భగవంతుని వైపుకే పయనిస్తుంది.

ప్రతీది భగవదిచ్ఛ మేరకే జరుగుతున్నప్పుడు తనను ఒకడు సన్మానిస్తే ఏమి? ఒకడు అవమానిస్తే ఏమి?

సుఖదుఃఖాలు ఉండి, వాటిని సమానంగా చూడడం కాదు, ఇది సుఖము, ఇది దుఃఖము అని సుఖదుఃఖాల స్పర్శే ఉండదు. అలాంటి పూర్ణజ్ఞాని మట్టి, బంగారం రెండూ ఒకటే; ఆత్మపదార్థమే.

ఒకదాని పట్ల ప్రత్యేక భావముగాని,

మరొకదానిపట్ల హీన భావముగానీ ఉండవు. అపకారి యెడల, ఉపకారి యెడల సమభావం కలిగి ఉంటాడు. సుకర్మలను ఆచరించేవానిపట్ల దుష్కర్మలను ఆచరించేవానిపట్ల సమదృష్టి కలిగి ఉంటాడు. సమూహంలో ఉన్నా ఏకాంతంలో ఉంటాడు.

చూసేవారికి కర్మప్రవాహంలో కొట్టుకుపోతున్నట్టు ఉంటాడు. తనకు తాను గట్టున చేరి సాక్షిగా చూస్తుంటాడు. గాలి లేని చోట దీపంలా నిశ్చలంగా ఆత్మగా ప్రకాశిస్తుంటాడు. సదా ఆత్మనిష్ఠలో ఉండడమే ప్రధానలక్షణం పరిపూర్ణయోగికి.

ఉన్న ఒక్క సత్పదార్థమే సకలసృష్టిగా భాసిల్లుతోంది. కాబట్టి ఎవడు సకలంలో సత్యాన్ని, సత్యంలో సకలాన్ని చూస్తాడో అట్టివానికి, నాకు(భగవంతనికి) భేదమే లేదు. అట్టివాడు ఎక్కడున్నా "నాలో"నే ఉంటాడు. వాడు ఏ పని చేస్తున్నా నా కార్యాన్నే నెరవేరుస్తుంటాడు.

అర్జునుడు: కృష్ణా! అటువంటి సత్యనిష్ఠ నాకు కలగడం లేదు ఎలా?

కృష్ణభగవానుడు: నిజమే. ఈ మనసు కోతిలా చంచలమైనది. దీనిని(మనసును) అదుపులో(ఆత్మలో) ఉంచడం కష్టమైన పనే. సందేహం లేదు. కానీ తప్పదు. ప్రయత్నపూర్వకంగా ఈ మనసును ఆత్మలో నిలబెట్టాలి. "ప్రయత్నం" అని పేరేగాని, ప్రయత్నం మొదలుబెట్టగానే అది అత్యంత సులభం అయిపోతుంది. అదే ఈ ఆధ్యాత్మికంలో ఉండే తమాషా.

ఆత్మలో ఉండడం, ఆత్మగా ఉండడం ఎంత సులభం అంటే, నదిలో దిగాక తడవడం ఎంత సులభమో అంత సులభం.

నదిలో దిగేవరకే ప్రయత్నం. తడవడానికి ఏ ప్రయత్నమూ చేయం కదా!

ఓ మనసా! నిరంతరం మారిపోతుండే విషయాలతో ఎప్పటికైనా నశించిపోయే వస్తువులతో నిండిపోయి వున్న ఈ ప్రపంచంలో నువ్వు ఏం సుఖం బావుకున్నావు? నిలకడగా ఏనాడైనా సుఖానుభూతిని పొందావా? రంగులరాట్నంలో తిరుగుతూ ఎవడైనా చందమామ సౌందర్యాన్ని ఆస్వాదించగలడా? ఐహిక విషయాల్లో తిరుగుతూ నీవు ఆత్మసుఖాన్ని అనుభవించడం కూడా అంతే. బయటకు పరిగెత్తడం మాని లోలోపలికి వెళ్లి, నీ పుట్టు చోటుకు చేరి నీ నిజరూపమైన ఆత్మగా విరాజిల్లు. అని నీ మనసుకు నచ్చజెబితే అది నీ మాట వింటుంది. నీ మనసు నీ మాటగాక ఇంకెవరి మాట వింటుంది? నిజంగా నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి.

అర్జునుడు: మనసును ఆత్మలో నిలబెట్టే ప్రయత్నంలో ఉన్న యోగి తన ప్రయత్నం పూర్తి కాకనే మరణిస్తే వారి గతి ఏమి?

కృష్ణభగవానుడు: తినేది నోరే అయినా ఆహారం వలన లభించే శక్తి మాత్రం మిగతా అన్ని అవయవాలకు సమంగా పంచబడుతుంది. అలాగే యోగి యొక్క ఉపాసనాఫలాన్ని మిగతా అందరికీ సమంగా పంచేస్తుంది ప్రకృతి. అంతేగాని పూర్తిగా ఆ సాధనాఫలం తన ఒక్కని వద్దనే ఉండదు. కుండనీళ్లను సముద్రంలో కుమ్మరిస్తే సముద్రవ్యాప్తం అయినట్లు ప్రతి ఒక్కని పాపపుణ్యఫలం మిగతా అందరికి కూడా సమంగా పంచబడుతుంది. ఎవడి కర్మఫలాన్ని వాడే అనుభవిస్తాడు అనేది తప్పు. ఎవడికైనా అనుభవంలోకి వచ్చేది సరాసరి అనుభవమే.

* * *

మరణం అంటే ఈ జగత్ స్వప్నాన్ని ఉన్నపళంగా వదిలేయడం.
పునర్జన్మ అంటే ఉన్నపళంగా ఉన్న చోటనే మరో స్వప్నాన్ని కనడం.

* * *

గతంలో(ముందు కలలో) తాను చేసిన గాఢమైన సంకల్పాలే మరుజన్మకు(మరో కల కనడానికి) బీజాలు అవుతాయి.

చెడు సంకల్పాలు, శుభసంకల్పాలు రెండూ మరో జన్మకు(కలకు) కారణమైనప్పటికీ చెడుసంకల్పాలు జన్మపరంపరలకు దోహదం చేస్తుంది.

శుభసంకల్పాలు మోక్షానికి(మెలకువకు) దోహదం చేస్తుంది. మోక్షం అంటే శాశ్వతమైన మెలకువ.

ఆ తరువాత నిద్రా(అజ్ఞానమూ) ఉండదు. కలలూ(జన్మలూ)ఉండవు.

మెలకువకు దోహదం చేసే శుభసంకల్పాలలో ధ్యానం అనేది అత్యుత్తమ శుభసంకల్పం. ధ్యానం అంటే పాపపుణ్యములు అనే మలినాన్ని శుభ్రం చేయడం. కాబట్టి కఠిన తపస్సులు, చాంద్రాయణవ్రతాలు, శాస్త్రవిచారణలు, అగ్నిహోత్రాది కర్మలు...వీటన్నిటి కంటే ధ్యానమే శ్రేష్ఠమైనది.

అర్జునా! నేను నిన్ను శాసిస్తున్నాను-
నీవు ధ్యానయోగివి కా!

* * *

కృష్ణభగవానుడు: దేనిని తెలుసుకుంటే, ఇక తెలుసుకోవడానికి ఏమీ మిగిలి ఉండదో అట్టి జ్ఞానాన్ని నీకిపుడు చెబుతా విను-

తాను కనే కలలో ఎంతమంది ఉన్నా కలను కనే తనకు సాటిరారు ఎవరూ.

కలలో ఉన్నవారందరూ మెలకువ కోసం ప్రయత్నించినప్పటికీ, కలలో ఉన్న తాను చేసే గాఢ ప్రయత్నం వలన మాత్రమే మెలకువ వస్తుంది. ఎందుకంటే, కలలోని తానొక్కడు మాత్రమే కల కనే "తన"తో సంబంధపడి ఉండేది.

* * *

నా మాయాశక్తి రెండు విధములుగా ఉన్నది-

1. పదార్థముగాను(పంచభూతములుగాను)

2.శక్తిగాను(మనసు, బుద్ధి, అహంకారములుగాను) ప్రకటనమై ఈ యావత్తు సృష్టికి కారణమై ఉన్నది.

నా(నేను) కంటే శ్రేష్ఠమైనది వేఱే ఏమీలేదు. ఎందుకంటే "నేను" తప్ప వేఱే ఏమీలేదు. కాసులహారంలో అన్నీ ఒకే బంగారు తీగకు గ్రుచ్చబడి ఉన్నవి. కాసులూ, తీగ రెండూ బంగారమే అయినట్లు సకలము, నేను అభిన్నము.

సకలంలో నన్ను చూడడం నీకు చేతకాకపోతే, నీకు ప్రత్యేకమని, విశిష్ఠమని అనిపించే వాటిల్లో ముందు నా ఉనికిని గుర్తించడానికి మొదట ప్రయత్నించు. తరువాత మిగతా వాటిల్లో కూడా నా ఉనికిని స్పష్టంగా చూడడం నేర్చుకోవచ్చు.

నేను దేనిలోనూ ఉండను.
"నా"లోనే అన్నీ ఉన్నాయి.
సముద్రంలో చేపలుంటాయేగాని,
చేపల్లో సముద్రం ఉండదు కదా!

* * *

దేనికది పరిపూర్ణం కాదు.
పరిపూర్ణంలో అన్నీ ఉన్నాయి.

రూపాయిలో చిల్లర ఉంటుందేగాని,
చిల్లరలో రూపాయి ఉండదు కదా!

మాయ అనేది సదా నా స్వాధీనంలోనే ఉంటుంది, కాపలా కుక్క వలె. అపరిచితుడు కుక్క బారి నుండి తప్పించుకోవాలంటే, ముందుగా దాని యజమానిని పిలవాలి. అలాగే నన్ను శరణం పొందినవారిని నా మాయ ఏమీ చేయదు.

1. బాధల్లో ఉండేవాడు.
2. ధనాన్ని కోరేవాడు.
3. సాధన చేసేవాడు
4. జ్ఞానియైనవాడు

ఈ నలుగురూ నన్ను (భగవంతుణ్ణి) ఆశ్రయించి ఉంటారు. ఈ నలుగురిలో జ్ఞాని శ్రేష్ఠుడు. అతడు నాకు మిక్కిలి ప్రియం. ఎందుకంటే అతడు నా స్వరూపమే కాబట్టి. మిగతా ముగ్గురు కూడా ఉత్తములే. ఎందుకంటే వారు కూడా చివరకు నన్నే చేరుకుంటారు కాబట్టి. నన్ను చేరుకోవడం అంటే, వారు "నేనే" అయిపోవడమన్న మాట.

దుఃఖంలో ఉండేవాడు కోరేది నన్నే.
నేనే సుఖాన్ని, పరమసుఖాన్ని.

ధనాన్ని కోరేవాడు నన్నే.
నేనే ధనాన్ని, పరమధనాన్ని.

సాధకుడు సాధించేది నన్నే.
నేనే సిద్ధిని, పరమపదాన్ని.

ఇక జ్ఞానికి నేనే మార్గం, నేనే గమ్యం.
అనంతుడైన నన్ను (నేనును) విడిచి ఎక్కడకూ వెళ్ళలేడు.

అటువంటి జ్ఞాన స్వరూపుడు మిక్కిలి దుర్లభుడు. ఎందుకంటే ఉనికి ఉండేది ఒక్క జ్ఞానికి మాత్రమే.

రెండు అనంతాలు ఉండనట్లు, జ్ఞానులు ఇద్దరు ఉండరు.

ఆ ఏకైక జ్ఞాని "నేనే".

నేను అంటే కృష్ణుడు కాదు.
నేను అంటే ఆత్మవాచకం.

ఎవరెవరు ఏయే దేవతామూర్తులను ఆరాధిస్తున్నా సరే
ఆయా దేవతారూపాల్లో ఉండి వారిని అనుగ్రహించేది "నేనే".

* * *

1. జరిగిపోయింది
2. జరుగుతున్నది
3. జరగబోయేది

ఈ మూడు కాలాల విశేషాలు నాకు తెలుసును.

ఈ మూడూ నాలోనే ఉనికి కలిగి ఉన్నాయి.
వాటిల్లో నేను ఉండను.

* * *

ప్రయత్నంతో నన్ను పొందినవారున్నారు.

అప్రయత్నంగా కూడా నన్ను పొందినవారున్నారు.

* * *

పొందటం, పొందకపోవడం అనేది నా ఇచ్ఛ మేరకే జరుగుతుంటుందిగానీ, వారి ప్రయత్న, అప్రయత్నాలతో సంబంధం ఉండదు.

నిజానికి ప్రయత్నంతో పొందినవారు కూడా అప్రయత్నంగా పొందినవారే.

తాటిచెట్టుపై కాకి వాలడం అనేది ఒక ఘటన.
తాటిపండు రాలడం అనేది మరొక ఘటన.

కానీ ఏకకాలంలో అవి జరగడం వలన
పండు రాలుట కార్యం అయ్యింది.
కాకి వాలుట కారణం అయ్యింది.
ప్రపంచంలో కనబడే కార్యకారణాలన్నీ ఇటువంటివే.

ప్రపంచంలో 'కార్యం' మాత్రమే ఉంటుంది.
'కారణం' ప్రపంచానికి ఆవల ఉంటుంది.
కలకు ఆవల కలకనేవాడు ఉన్నట్లు.

ఆ మూలకారణం 'నేనే'.

ఎవరు నన్ను(నేనును) ఆశ్రయిస్తారో వారు నేనే అయిపోతారు. సముద్రంలో కలిసి సముద్రమే అయిపోయిన నది వలె.

* * *

ఆపదలనేవి నన్ను తెలుసుకోవడానికి కావలసినంత ఆర్తిని అవి కలుగజేస్తాయి. కాబట్టి ఆపదలు సాధకునికి స్నేహితులే.

మరణమాసన్నమైన సమయంలో సైతం ఆత్మనిష్ఠను కలిగించే సంఘటన హఠాత్తుగా సంభవించవచ్చు.

కాబట్టే మరణ సమయంలో నా నామాన్నే గట్టిగా వినిపిస్తుంటారు అతడి బంధుజనులు.

1. అర్జునుడు: బ్రహ్మమంటే?
కృష్ణ భగవాన్: "ఉన్నది" ఏదో అది (సత్)

2. అర్జునుడు: ఆధ్యాత్మికమంటే?
కృష్ణ భగవాన్: ఆ బ్రహ్మము యొక్క స్వభావము (చిత్)

3. అర్జునుడు: కర్మ అంటే?
కృష్ణ భగవాన్: సృష్టికి ప్రధాన కారణమైన ఆ బ్రహ్మము యొక్క విలాస సంకల్పము (ఆనందము)

4. అర్జునుడు: అధిభూతము అంటే?

కృష్ణభగవాన్: ఉన్నట్లున్నది(లేనిది). నశించే స్వభావము గల శరీరము.

5. అర్జునుడు: అధి దైవతము అంటే?

కృష్ణభగవాన్: నశించని పదార్థము (ఆత్మ)

* * *

ఆభరణము - అధి భూతము.

బంగారము - అధి దైవము.

* * *

6. అర్జునుడు: అధియజ్ఞుడు ఎవడు?

కృష్ణభగవాన్: ఆభరణానికి అధిష్ఠానం బంగారం అయినట్లు ఈ చరాచర ప్రకృతికి అధిష్ఠానమే అధియజ్ఞుడు. అతడు సత్-చిత్-ఆనందరూపుడుగా ప్రకాశిస్తుంటాడు.

7. అర్జునుడు: మరణ సమయంలో జీవుని పరిస్థితి ఏమి?

కృష్ణభగవాన్: ఆ సమయంలో మొత్తపు జీవితాన్ని జల్లెడ పడుతుంది మనస్సు. అన్ని అనుభవాలూ జారిపోయి, ఒకటో రెండో గాఢమైన విషయాలు తేలుతాయి. అవే పునర్జన్మకు బీజాలవుతాయి. అదే నవశిశువుగా మొలకెత్తుతుంది. తల్లి జోలపాటే క్రొత్త జీవితానికి సుప్రభాతం అవుతుంది.

మరణసమయమున అట్టి బలమైన సంస్కారాలు ఏవీలేక కేవల స్వరూపమై ఉన్న నన్నే (నేనునే) ధ్యానిస్తూ తుదిశ్వాస విడిచినవాడు నన్నే పొందుతాడు(దైవమే అవుతాడు).

* * *

తాను ఏకం అని తలిస్తే తాను దేవుడు.

తాను అనేకం అని తలిస్తే తాను ప్రపంచం.

దేవుడు, ప్రపంచం రెండూ తలంపులే.

తలచే 'తానే' నిజంగా దైవం.

* * *

దైవం శబ్దరూపం - ఓం.

ఓం ఘనరూపం - ప్రపంచం.

* * *

ఓం అంటే అ-ఉ-మ సమ్మేళనం.

అకారం - సృష్టి.

ఉకారం - స్థితి.

మకారం - లయం.

ఓంకారమూ దైవమే.

ఓంకారాన్ని పలికేవాడూ దైవమే.

ఓంకారమే ఓంకారాన్ని పలుకుతుంది.

ఓంకారధ్వనికి ప్రతిధ్వనియే ప్రపంచం.

అట్టి ఓంకారానికి నిజమైన అర్థం - "నేను".

కాబట్టి ఇతర ఎట్టి సాకార, వికారాలను ధ్యానం చేయకుండా కేవలం 'నేను' అనే నిరాకార ధ్యానం ఎవడైతే చేస్తాడో వానికి ముక్తి సులభం.

సముద్రాన్ని చేరిన నది నామరూపాలను కోల్పోయినట్లుగా 'నేను' అనే నిరాకార ధ్యానంలో మునిగిపోయిన వ్యక్తి తన అనుభవంలో నామరూపాలను కోల్పోయి కేవలాత్మగా మిగిలిపోతాడు.

* * *

మెలకువ రాగానే కల నశిస్తుందేగాని కలకనేవాడు నశించనట్లు, సకల చరాచరము నశిస్తుందేగాని 'నేను' అనేది నశించదు.

వేదాలు చదివినవాని కంటే

యజ్ఞాలు చేసినవాని కంటే

చాంద్రాయణ వ్రతాలు చేసినవాని కంటే

దానములు చేసినవాని కంటే

"నేను" అన్న అహంస్వరూపనిష్ఠలో ఉన్నవాడే ఎక్కువ ఫలితాన్ని పొందుతాడు. అనగా ముక్తిని పొందుతాడు.

* * *

కృష్ణభగవాన్: అసూయ లేని ఓ స్నేహితుడా!

దేనిని తెలుసుకుంటే ఇక తెలుసుకోవడానికి ఏమీ మిగిలి ఉండదో అట్టి పరమరహస్యమైన పరతత్త్వాన్ని నీకు చెబుతాను విను.

'నేను'ను తెలుసుకున్నవాడు జనన మరణ చక్రము నుండి విడివడతాడు. యెందుకంటే 'నేను' అనేది ఆ సంసారచక్రానికి ఇరుసు వంటిది. ఇరుసు స్థానంలో నీవున్నప్పుడు అదే ఆత్మానుసంధానం.

పెట్టెలో ఆభరణాలు ఉంటాయి. ఆభరణాల్లో పెట్టె ఉండదు. అట్లే సకలమూ నాలో ఉంది. సకలంలో నేను ఉండను.

జ్ఞానదృష్టితో చూస్తే-
నిజానికి నాలో ఏమీ(సకలం అనేది కూడా) ఉండదు.
'నేనున్నాను' అన్న కేవలమైన ఆనందస్ఫురణ తప్ప.

గాలి ఆకాశంలో అంతటా వ్యాపించి ఉన్నప్పటికీ ఆకాశాన్ని అంటక ఉన్నట్లుగా, తలంపు అనేది తనువులో ఉంటూనే తనువును అంటక ఉన్నట్లుగా, ప్రపంచం కూడా నాలో అలానే ఉన్నది ఓ తలంపుగా.

నేను తలిస్తే సృష్టి.
తలవడం మానుకుంటే లయం.

* * *

విషయాసక్తి లేకుండా కర్మ చేసేవాడు
కర్మ చేస్తున్నా చేయనివాడే అవుతాడు.

రాజభవనాన్ని కడుతున్న కూలీ
రాజభవనాన్ని నాది అనుకోడు కదా!

కోశాధికారి చుట్టూ ఎంత సంపదున్నా
దానిని తన సంపద అనుకోడు కదా!

విరాగి అయిన జ్ఞాని ఈ ప్రపంచంలో అలానే ఉంటాడు.
తన పని తాను చేసుకుంటూ ఉంటాడు ఏ స్పందనా లేకుండా.

నేను కనే కలలో నేను ఉన్నప్పటికీ 'ఇది ఒక కల' అని కలలో ఉన్న తనకు తెలిసిపోతే అది కల అయినప్పటికీ అది కల కాదు, మెలకువే.

అలాగే నా సృష్టి తత్త్వాన్ని ఎవడైతే తెలుసుకుంటాడో
వాడు కర్మబంధంలో చిక్కుకోడు.

ఇదొక కలగా, లీలగా మాత్రమే తీసుకొని స్థిమితంగా ఉంటాడు.

తోలుబొమ్మలాట ప్రదర్శన పూర్తవగానే, ఆ బొమ్మలన్నింటినీ ఓ పెట్టెలో భద్రపరచి, తిరిగి మరునాటి ప్రదర్శనకు వాటిని తీసి ఆడిస్తున్నట్టు, ప్రళయంలో సకలజీవరాశి అంతా నా యందే సూక్ష్మరూపంలో ఉంటుంది. తిరిగి కల్పారంభంలో వాటిని వ్యక్తపరుస్తాను. క్రొత్తగా సృష్టి చేసినట్లు భావిస్తారేగానీ, నిజానికి క్రొత్త సృష్టేమీ కాదు.

లోపలున్నది వెలుపలికి వస్తే అది సృష్టి.
వెలుపలున్నది లోపలికి వెళితే అది లయం.
పుట్టలో నుంచి వెలుపలికి వచ్చి, ఉన్నంతసేపు ఉండి, తిరిగి పుట్టలోకి పోయినట్లుగా.

ఇంతకు మించి క్రొత్తగా ఏ వస్తువూ పుట్టదు.
ఏదీ చావదు.

"నాలో" నాకు అభిన్నంగా ఉన్న మాయాశక్తి యొక్క చమత్కారం వల్లనే ఇదంతా జరుగుతున్నట్టు అనిపిస్తుందేగానీ, వాస్తవానికి అసలేమీ జరగడం లేదు.

సృష్టి లేదు, లయమూ లేదు.
కేవల "స్థితి" మాత్రమే ఉన్నది.

ఏ కర్మా నన్నంటదు.
దానికి ఏకైక కారణం-
విషయాలపట్ల ఆసక్తి లేకుండా ఉదాసీనంగా ఉండడమే.

నా అధ్యక్షతనే అన్నీ జరుగుతుంటాయి.
అందువలన ప్రత్యక్షంగా నేనేమీ చేయకపోయినా పరోక్షంగానైనా అన్నీ నేనే చేసినట్టు లెక్కకు వస్తోంది.

మూఢభక్తులు ఇవేవీ తెలియక నామరూపాలు కలిగిన శరీరంగా నన్ను తలచి నన్ను అవమానిస్తున్నారు.

వారు "సత్" అనే నాణేనికి ఒకవైపు భాగానికి మాత్రమే పరిమితం అయిపోయారు. తెరపై కదలాడే నీడలకు మాత్రమే బంధీలైపోయారు.

బొమ్మ-బొరుసు రెంటిలో ఏ ఒక్కటి లేకపోయినా ఆ నాణెం చెల్లదు.

తెర-దృశ్యం ఏ ఒక్కటి లేకపోయినా ఆ నాటకం జరగదు.

ఉన్నది-ఉన్నట్లున్నది అనే నా రెండు పార్శ్వాలను ఎరిగినవాడే నిజంగా నన్నెరిగినవాడు.

నీవు భోజనం చేసినా, హోమం చేసినా
నీవు ధ్యానం చేసినా, దానం చేసినా

అన్నిటి లక్ష్యం "నేనే" అని తెలుసుకుని చేస్తూ ఉండు.

అప్పుడే వాటివల్ల ఫలితం ఉండేది. ఫలితం అంటే మరేదో అనుకునేవు. ఎప్పటికప్పుడు కర్మబంధం నుండి విడివడుతూ ఉండడమన్న మాట. అనగా ఏ క్షణానికాక్షణం మోక్షం. ఇదే నిత్యముక్తి అంటే.

సర్వ ప్రాణుల్లో సర్వప్రాంతాల్లో 'నేను' సమంగా నిండి ఉన్నాను. నాకు ఒకరు మిత్రువు అనిగాని, మరొకరు శత్రువు అనిగాని అలాంటి భావమేమీ ఉండదు.

నా పంటిక్రిందపడి నా నాలుక నలిగితే, కోపంతో నా పళ్లను నేనే పీకేసుకుంటానా? పళ్లూ నేనే, నాలుకా నేనే. ఈ జ్ఞానాన్ని ఎవడైతే గ్రహిస్తాడో వాడిలో నేనుంటాను. నాలో వాడుంటాడు. మా ఇద్దరి మధ్య ఏ బేధమూ ఉండదు. అలాంటి అనన్యభక్తుడు శాశ్వతుడనైన నాతో మమేకం అయి ఉంటాడు కాబట్టి వాడు నన్నే పొందుతాడు, నేనే అవుతాడు. భ్రమరకీటకా న్యాయము వలె.

* * *

జ్ఞానగీత - 6

---

ఈ ఆధ్యాత్మికంలో-
కులమత ప్రసక్తిగాని, స్త్రీపురుష ప్రసక్తిగాని లేదు.
'నేను' అనేది ఏ మతం, ఏ కులం అని చెప్పగలం?
'నేను' అనేది స్త్రీయా? పురుషుడా?

స్త్రీ-పురుష అనేది ప్రకృతి నియమం.
నేను-ఉన్నాను అనేది పారమార్థిక నియమం.

నీవు ఆయా స్థానాల్లో ఉన్నప్పుడు ఆయా నియమాలు నిన్నావహించి నడిపిస్తాయి.

నీవు సదా "నేనున్నాను" అన్న పారమార్థిక క్షేత్రంలో సంస్థితమై ఉండు.

ఇక ఏ ఘర్షణా ఉండదు.

సర్వమూ "నేను"కే అర్పించు.
సదా "నేను"నే ఆరాధించు.
నిరంతరం "నేను"నే లక్ష్యంగా పెట్టుకో.
చివరికి "నేను"ను చేరుకుంటావు.
"నేను"గా శేషిస్తావు.
"నేను" అనేది సత్-చిత్-ఆనంద సాగరం.
అక్కడ ఆనందానికి కొలతలు లేవు, కారణాలు లేవు.

* * *

అర్జునా! నా ఉపదేశాలంటే నీకు చాలా ప్రియమని నాకు తెలుసు. అందుకే నీకు శ్రేయస్సును చేకూర్చే మాటలు ఇంకా ఇంకా చెప్పాలని నాకు కుతూహలంగా ఉంది.

నా(నేను) యొక్క పుట్టుక గురించి దేవతలకు కూడా తెలియదు. యెందుకంటే వారు పుట్టకముందు నుంచే నేనున్నాను. దేవతల్లోనూ మొదటివాణ్ణి నేను.

ఏది ఉండాలన్నా దానికి ఓ ఆధారం ఉంటుంది.
ఏది జరగాలన్నా దానికి ఓ కారణం ఉంటుంది.
కానీ నాకు(నేనుకు) ఏ ఆధారమూ, ఏ కారణమూ అవసరం లేదు.

నాకు నేనే ఆధారం.

నాకు నేనే కారణం.

నేనే సకలానికి ఆధారాన్ని.

నేనే సకలానికి కారణాన్ని.

అని ఎవడైతే గ్రహిస్తాడో, వాడు పాపాల నుండి (అనగా కర్తృత్వభావనతో చేసిన కర్మల నుండి) విముక్తి పొందుతాడు.

జ్ఞానాజ్ఞానములు ఉండడం, లేకపోవడం

సుఖదుఃఖాలు ఉండడం, లేకపోవడం

భయాభయాలు ఉండడం, లేకపోవడం

నా ఇచ్ఛ వలననే సర్వజీవులకు కలుగుతున్నాయి, ఉంటున్నాయి, తొలగుతున్నాయి.

నా మనోభావం వలన మహర్షులు, మనువులు పుట్టారు. వారి నుంచి ఈ భౌతికజగత్తు, భౌతికజీవులు ఆవిర్భవించాయి.

కాబట్టి సకల సృష్టికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను కారణమై ఉండి సకలాన్ని నడిపిస్తుండేది "నేనే".

అని తెలుసుకున్నవాడు "నా" యందు భక్తి లేకుండా ఎలా ఉండగలడు?

"కారణానికే కారణం" అని తెలుసుకున్న కారణంగా భక్తిపూరితుడై సదా నన్నే స్మరిస్తూ, సేవిస్తూ తరిస్తాడు పూర్ణభక్తుడు.

అర్జునుడు: దేవా! ఇప్పటివరకు నీవు చెప్పినదంతా పరమసత్యమని గాఢంగా అనిపిస్తోంది. ఈ పరమపవిత్రమైన జ్ఞానాన్ని దేవతలుగాని, దానవులుగాని స్వయంగా తెలుసుకోలేరు. కేవలం నీ(సద్గురు) అనుగ్రహం వలన మాత్రమే అది సాధ్యం. అంతటా నీవే, అన్నీ నీవే అనే సర్వాత్మభావం మనసుకు పట్టడం అంత సులభం కాదు. భరిణెలో ఏనుగును పట్టించాలనే ప్రయత్నమే అది. బిందెలో సముద్రాన్ని నింపేయాలనే ప్రయత్నమే అది.

కృష్ణా! నీవు బోధిస్తున్న జ్ఞానం కూడా సముద్రంలా గంభీరమైనది, విశాలమైనది, పూర్ణమైనది. చిన్న చిన్న పరిమితుల్లో ఇరుక్కుపోయిన మా బుద్ధులకు అది అవగాహనకు రావడం అంత సులభం కాదు. అన్నింట్లో నిన్ను చూడడం మాకు చేతకాదు. కొన్నింట్లోనైనా నిన్ను చూడగలిగే చూపును మాకు ప్రసాదించు.

కృష్ణభగవాన్: మంచిది. అయితే విను.

ప్రతి జీవి హృదయంలో 'అహంస్వరూపం'గా ఉన్నాను. అందరిలో నేను-నేను అనే స్ఫురణరూపంగా ఉండేది నేనే.

నేను-నేను అని అనకపోయినా ఉనికి ఉన్న ప్రతివస్తువులోనూ 'ఉనికి'గా ఉన్నది నేనే.

ప్రకాశాల్లో సూర్యుణ్ణి - నక్షత్రాల్లో చంద్రుణ్ణి.
వేదాల్లో సామవేదాన్ని - దేవతల్లో ఇంద్రుణ్ణి.

ఇంద్రియాల్లో  మనసుని - ప్రాణుల్లో చైతన్యాన్ని.
రుద్రుల్లో శంకరుణ్ణి - యక్షుల్లో కుబేరుణ్ణి.
పర్వతాల్లో మేరువుని - పురోహితుల్లో బృహస్పతిని.
సేనానాయకుల్లో కుమారస్వామిని - సరస్సుల్లో సాగరాన్ని.
మహర్షుల్లో భృగువుని - శబ్దాల్లో ఓంకారాన్ని
యజ్ఞాల్లో జపాన్ని - స్థిరత్వంలో హిమాలయాన్ని

వృక్షాల్లో రావిని - దేవర్షుల్లో నారదుణ్ణి
సిద్ధుల్లో కపిలుణ్ణి - మనుషుల్లో రాజుని
ఆయుధాల్లో వజ్రాన్ని - రాక్షసుల్లో ప్రహ్లాదుణ్ణి
మృగాల్లో సింహాన్ని - పక్షుల్లో గరుడుణ్ణి
నదుల్లో గంగని - అక్షరాల్లో అకారాన్ని
నేనే.

అలా అని అవి మాత్రమే నేను అని కాదు.
సకల చరాచరానికి మూలకారణం నేనే.
ప్రపంచంలో నేను లేనిదంటూ, నేను కానిదంటూ ఏదీ లేదు.
ఎందుకంటే ఈ ప్రపంచం నాలోనిది.

నీకు ఏదైతే గొప్ప విషయాలుగా అనిపిస్తాయో, వాటిల్లో నన్ను చూడ్డానికి అలవాటు చేసుకో ముందు. ఆ తరువాత సాధారణ విషయాల్లో కూడా నన్ను చూడడం చేతనవుతుంది. ఇన్ని మాటలెందుకు? ఇంత విభజన యెందుకు? కనబడుతున్న సర్వ ప్రపంచం "నేను" అనే సూర్యకాంతిలో ఓ కిరణం మాత్రమే అని తెలుసుకో.

అర్జునుడు: కృష్ణా! నా మీద నీకున్న మిక్కిలి వాత్సల్యంతో పరమరహస్యమైన దివ్యజ్ఞానాన్ని ప్రబోధిస్తున్నావు. నాకున్న భ్రాంతి, పొరలు పొరలకు విడిపోతోంది. ఒక సద్గురువు యొక్క ప్రబోధ మాహాత్మ్యం ఎలాంటిదో నీ విషయంలో నాకు అవగతమైంది.

ఇప్పటివఱకు కొన్ని విశిష్టమైనవాటిల్లో మాత్రమే నిన్ను చూడగలిగే దృష్టిని ఇచ్చావు. ఇప్పుడు నీ పూర్ణమైన స్వరూపాన్ని ఒక్కసారి నా కళ్లతో చూడాలని ఉంది. ఇది సాధ్యమా? కాదా? అన్న విచక్షణ లేకుండా అత్యాశతో అడుగుతున్నాను.

కృష్ణా! నీ విశ్వరూపాన్ని నాకు దర్శింపచేయి.

కృష్ణభగవాన్: అలాగే చూద్దువుగాని... అయితే ఈ భౌతిక నేత్రాలతో చూడ్డం మాత్రం సాధ్యం కాదు. అది వేరే కన్నుతో చూడవలసిందే. అదే "తుదిలేని కన్ను". "చూడబడేది-చూచేవాడు-చూపు" మూడూ కలిసి ఉన్న కన్ను అది. వాస్తవానికి అటువంటి కన్నుతో చూడ్డానికి ఏమీ ఉండదు. అక్కడ నా రూపం, నీ రూపం అంటూ ఏమీ ఉండదు.

ఒకవేళ నీవు ఆ తుదిలేని కన్నుతో విశ్వరూపాన్ని చూచినా, అది నీ యొక్క విశ్వరూపమే అవుతుంది. ద్రష్ట కన్నా దృశ్యం వేరుగా ఉండదు కదా! ఆ విశ్వరూపంలో ఈ కృష్ణార్జునులు కూడా ఓ భాగమే. స్వప్నంలో మరో ప్రపంచాన్ని నీలో చూస్తున్నట్టుగా నీలో 'విశ్వరూపం' అనే మహాస్వప్నాన్ని నీ ఇష్టమొచ్చినట్టు కను.

* * *

ఈత రాని వాడు గట్టునున్న కొమ్మను ఒక చెత్తో పట్టుకుని మరొక చేతితో ఈదుతున్నట్టు, అర్జునుడు కూడా 'నేను అర్జునుడను' అనే దేహాత్మభావాన్ని పూర్తిగా విడిచిపెట్టకనే, విశ్వరూపసందర్శనం చేయాలనే సాహసం చేస్తున్నాడు. వేయి సూర్యుల కాంతి ఒక్కసారిగా సాక్షాత్కరించింది. అర్జునుడు భయపడ్డాడు. నిజంగా భౌతిక నేత్రాలతో చూసి వుంటే, అర్జునుడు గ్రుడ్డివాడైపోయి వుండేవాడు.

ఇంతవరకు అనేక విభజనలతో అనుభవించిన ప్రపంచం, ఇప్పుడు అంతా కలిసిపోయి ఒకే ముద్దగా కనబడేసరికి గొప్ప ఆశ్చర్యానికి లోనయ్యాడు. శరీరం గగుర్పాటుకు లోనయ్యింది. భయం, ఆశ్చర్యం, గగుర్పాటు మొదలైనవన్నీ దేహాత్మభావం ఇంకా కొంత శేషించి ఉండడం వల్లనే కలుగుతాయి.

ఆ దేవదేవునికి భయభక్తులతో శిరస్సు వంచి, నమస్కరించి ఇలా అంటున్నాడు అర్జునుడు-

దేవా! నీ అనంతమైన రూపంలో దేవతలతో సహా సకల ప్రాణుల్ని చూస్తున్నాను. అనేక ముఖాలతో, అనేక చేతులతో కూడిన మహారూపాన్ని చూస్తున్నాను. ఆ మహారూపంలో సకలమూ ఉంది కాని, అందులో ఆది, అంతము లేవు.

ఈ మహా విశ్వం మొత్తం సూర్యుడితోనే నిండిపోయిందా అన్నంత కాంతితో ప్రకాశిస్తున్న నిన్ను చూడడం నాకు సాధ్యం కావడం లేదు.

నీవు నాశరహితుడివి.

నీవు ఉన్నవాడివేగాని, ఒకప్పుడు పుట్టి ఉన్నవాడివి మాత్రం కావు. అన్నిటికన్నా అధికుడివి నీవు. కాబట్టి లోకులు తెలుసుకోవలసిన ముఖ్య విషయం ఏదైనా ఉందంటే - అది నీవే. నిన్ను తెలుసుకోవడం ఒక్కటే తెలుసుకోవడం అవుతుంది. నిన్ను తెలుసుకోకుండా ఇక ఏమి తెలుసుకున్నా అది తెలుసుకున్నట్లు కాదు.

నదులు ఎలా అయితే సముద్రం వైపుకు లాగబడుతున్నాయో అలాగే నరులు భయంకరమైన కాలమనే నీ కోరలతో నమలబడడానికి పర్వతగుహలాంటి నీ నోటి వైపుకు లాగబడుతున్నారు. ఏదీ, ఎవరూ వారి వారి స్వాధీనంలో లేరు. మంటలో పడి ఎలా అయితే మిడుతలు నశిస్తాయో, అలా కౌరవసేనతో సహా మొత్తం జీవరాశి అంతా పరంజ్యోతివైన నీలోకి ప్రవేశించి లయమౌతోంది.

దేవా! నీ ఈ ఉగ్రరూపాన్ని చూడలేకున్నాను. నాకు నీవు మళ్లీ నా బావగా కనబడి, నన్ను స్వస్థత పరచు. కృష్ణా! ప్రసన్నుడవు కా!

నా బావే కదా అని గతంలో నిన్ను ఎన్నెన్నో మాటలన్నాను. పరిహాసాలు చేశాను. ప్రియుడు ప్రియురాలి తప్పులను క్షమించునట్లు, నా తప్పులను కూడా నీవు అలా క్షమించు.

దేవా! నీ భయంకరమైన రూపాన్ని చూసి నేను తట్టుకోలేకపోతున్నాను.

ఇంతకీ నీవెవరవు?

నా స్నేహితుడివా? లేక నా బావరూపంలో ఉన్న భయంకరుడివా?

కృష్ణభగవాన్: అర్జునా! అధర్మపరులైన జననాశం చేయడానికి అవతరించిన కాలస్వరూపుణ్ణి నేను. ఇంతకాలం నీ సావాసగాడిగా నటిస్తూ, సరైన సమయం కోసం యెదురుచూస్తున్నాను. నా అవతారకార్యం నెరవేరడానికి అవసరమైన యుద్ధం రానే వచ్చింది. దీనిని నీవు నీ కులనాశనం అనుకోవద్దు. వీరిని నీ బంధువులు అనుకోవద్దు. ధర్మపరుడవైన నీకు, అధర్మపరులైన వీరు శత్రువులు.

నిజానికి నా చేతిలో నీవొక ఆయుధం.

కౌరవసంహారం చేసేది నేనేగాని, నీవుకాదు. నీకు ఏ దోషమూ, ఏ పాపమూ అంటదు. ఈ భారత కథకే కాదు, జగత్కథకు కూడా కర్త-కర్మ-క్రియ నేనే.

నేను అంటే నాలో నాకభిన్నంగా ఉన్న నా మాయాశక్తి.

నా మాయాశక్తి చేసిన వికటాట్టహాసమే ఈ మహాసృష్టిగా విస్ఫోటనమయ్యింది. అందులో "కృష్ణుడు" అనే అవతారం కూడా నా మాయాశక్తి యొక్క విశేషమే.

నీవిప్పుడు యుద్ధం చేయనంత మాత్రాన బ్రతికేవాళ్లు ఎవ్వరూ లేరిక్కడ. నిజానికి నీతో సహా మిగతా నీ అన్నదమ్ములు కూడా నాచే మ్రింగబడుతున్నవారే. ఆ మ్రింగబడుతూ ఉన్న ఆ కార్యక్రమానికే "జీవితం" అని పేరుపెట్టి అనుభవిస్తుండేది అందరూ.

అర్జునుడు: దేవాదిదేవా! నిన్ను సతతమూ కీర్తిస్తూ ఉండిపోవాలనిపిస్తోంది. అదే నాకిప్పుడు పరమానందకరమైన విషయం. కానీ నీచే స్వధర్మానుష్ఠానానికై శాసింపబడినవాడిని. అధర్మనాశనానికై యుద్ధం చేయవలసిన కర్తవ్యం కలిగి ఉన్నవాణ్ణి. ప్రస్తుతం నీవు నాకు చెప్పిన పని(కర్మ) చేయడమే భక్తి, స్తోత్రము, కీర్తనము.

గతంలో నేనెన్నడూ చూడని ఈ విశ్వరూపాన్ని నీవు చూపినందుకు ఒక వైపు సంతోషమేగాని, సకలాన్ని మ్రింగేస్తున్న నీ భయంకర రూపాన్ని చూడలేక భీతి చెందడమూ జరిగింది. నీ పూర్వరూపానికి తిరిగి రా! నన్ను నీవు బావా! అని ప్రేమతో పలుకరిస్తేగాని, నా మనస్సు కుదుటపడదు.

కృష్ణభగవాన్: అలాగే బావా! ఇదిగో చూడు...నీకు పరమాహ్లాదం కలిగించే నా పూర్వరూపాన్ని చూడు...

అర్జునా! నీ అదృష్టాన్ని ఏమని చెప్పను? ఇంతవరకూ ఎవరూ నావిశ్వరూపాన్ని చూచినవారు లేరు. వేదాల వలనగాని, యజ్ఞాలవలనగాని, శాస్త్ర అధ్యయనాలవలనగాని, దానాల వలనగాని, ఉగ్రమైన తపస్సుల వలనగాని ఈ విశ్వరూపాన్ని చూడగలగడం అనేది ఈ మానవలోకంలో నీకు తప్ప ఎవరికీ సాధ్యం కాదు. భయం వదులు. నన్ను తెరిపారా చూడు. నేను నీ ప్రియమైన బావనే.

అర్జునుడు: కానీ నిన్నిప్పుడు 'బావా!' అని పిలువడానికి నాకు మనసు రావడం లేదు. ఇక నుంచి నీ పవిత్రమూర్తిని "దేవా" అని మాత్రమే సంబోధిస్తాను.

కృష్ణభగవాన్: అలాగే బావా! నీ ఇష్టం. నీవు ఏ పేరుతో పిలిచినా నేను పలుకుతాను.

నన్ను లక్ష్యంగా పెట్టుకుని చేసే ఏ కర్మయినా అది యజ్ఞమే, అది తపస్సే. అలాంటివారినే జీవన్ముక్తులు అనేది. జీవించి ఉండగానే సమస్థితిని పొందినవారే జీవన్ముక్తులు. అర్జునా! నీవు జీవన్ముక్తుడవు.

భక్తి అంటే, కేవలం విగ్రహాన్ని ఆరాధించడం కాదు, రోమాంచితమయ్యేలా భజన చేయడం కాదు, దివ్యదర్శనాలతో కళ్లు ఆనందభాష్పాలతో నిండడం కాదు. ఇవన్నీ ఆధ్యాత్మికం దుర్బలత్వంతో ఉన్నప్పుడు కలిగే వికారాలు తప్పితే, ఇవి కోరదగినవి కావు.

కర్మ అయినా, భక్తి అయినా జ్ఞానంతో కూడి ఉన్నప్పుడు మాత్రమే అవి ఫలప్రదములు.

సామాన్యజనులు భావిస్తున్నట్టు- కర్మ మొదటిదశ, భక్తి రెండవదశ, జ్ఞానం మూడవదశ అనడం శుద్ధతప్పు. తొలిగా మనం సంపాదించవలసింది జ్ఞానాన్నే(అవగాహననే) జ్ఞానం వల్లనే నిష్కామకర్మ చేయగలవు. జ్ఞానం వల్లనే వికారరహిత భక్తిని కలిగివుండగలవు.

మళ్లీ చెబుతున్నాను-

జ్ఞానం అంటే విషయసేకరణ కాదు,

జ్ఞానం అంటే సత్యనిష్ఠ.

జ్ఞానం అంటే ధర్మాచరణయందు శ్రద్ధ.

కాబట్టి జ్ఞానమే నిజమైన కర్మ, జ్ఞానమే నిజమైన భక్తి.

* * *

జ్ఞానగీత - 7

---

అర్జునుడు: దేవా! ఎవడు శ్రేష్టుడు? నిరాకారోపాసకుడా? సాకారోపాసకుడా? ఇంతకీ నీవు నిరాకారుడివా? సాకారుడివా?

కృష్ణభగవాన్: మంచి ప్రశ్న వేశావు అర్జునా! అయితే సమాధానం నా వద్ద లేదు. నీ వద్దనే ఉంది. నీవు సాకారుడివైతే, నేనూ సాకారుడనే. నీవు నిరాకారుడవైతే, ఇక అక్కడ సాకార,నిరాకార గొడవేదీ ఉండదు.

ఏది నాశరహితమో

ఏది ఫలానా అని చెప్పలేమో

ఏది అవ్యక్తమో

ఏది సర్వవ్యాపకమో

ఏది అచింతనమో

ఏది సకలానికి కేంద్రమో

ఏది అచలమో

అట్టి "నేను"ను ఎవడైతే ఉపాసిస్తాడో అనగా ఆ నా దివ్యలక్షణాలను ఎవడైతే సదా స్మరించుకుంటూ ఉంటాడో, వాడు నన్నే చేరుకుంటాడు.

ఈత వచ్చినవాడు ఈదుకుంటూ నది దాటుతాడు.

ఈత రానివాడు పడవ సహాయంతో నది దాటుతాడు. అలా విగ్రహాన్ని ఆలంబనగా చేసుకుని తరించేవాడు భక్తియోగి.

నిరాకారమైన ఆత్మనిష్ఠలో ఉండి తరించేవాడు జ్ఞానయోగి.

కర్మాచరణలో మహానేర్పరి అయినవాడు అనగా నన్ను చేరడమే పరమలక్ష్యంగా పెట్టుకుని కర్మలను ఆచరించేవాడు కర్మయోగి.

అభ్యాసం అను, ధ్యానం అను ఇవన్నీ మనసుతో చేసే పోరాటాలే. వీటివల్ల మనసు ఓడదు. ఇంకా బలబడుతుంది. దొంగను పట్టుకునే పనిని దొంగకే అప్పగించినట్టు, ఆ దొంగ వెతుకుతున్నట్టు నటిస్తాడేగానీ, పని కాదు. ఆ దొంగ మనస్సుకు యెదురుతిరిగి, "ఇంతకీ నీవెవరు? నీ స్వరూపమేమి? అసలు నీకేంకావాలి? నీ చోటేది?" అని ప్రశ్నిస్తే చాలు. అది నిశ్చేష్టయై నిలబడిపోతుంది. నిశ్చేష్టయైన మనసే ఆత్మగా సాక్షాత్కరిస్తుంది. మనసును జయించడం అంటే ఇదే, ఇంతే.

అర్జునుడు: క్షేత్రం అంటే?

కృష్ణభగవాన్: శరీరం.

అర్జునుడు: క్షేత్రజ్ఞుడు అంటే?

కృష్ణభగవాన్: శరీరంలో 'నేను' అనే స్వయంస్ఫురణతో మమేకమై ఉన్న జీవుడే(జ్ఞానియే) క్షేత్రజ్ఞుడు.

అర్జునుడు: జ్ఞాని లక్షణాలేవి?

కృష్ణభగవాన్: 1. తనను తాను పొగడుకోకపోవడం.

2. దంభం లేకపోవడం.

3. అహింస.

4. ఓర్పు.

5. నిజాయితీ.

6. సద్గురు సేవ.

7. శుచిగా ఉండడం.

8. నిలకడగా ఉండడం.

9. మనస్సును నిగ్రహించడం.

10. వైరాగ్యం.

11. అహంకారం లేకపోవడం.

12. తన చావును తలపోస్తూ ఉండడం.

13. దేని యెడలా ఆసక్తి లేకపోవడం.

14. కుటుంబంతో తాదాత్మ్యం చెందకుండా ఉండడం.

15. ఏది ప్రాప్తించినా సమభావం కలిగి ఉండడం.

16. "నా" యెడల అనన్యభక్తి కలిగి ఉండడం.

17. ఏకాంతంగా గడపడం.

18. జన సమ్మర్ధంలో తిరగడమంటే అయిష్టత.

19. సదా ఆధ్యాత్మిక జ్ఞానంలో ఉండడం.

20. తత్త్వజ్ఞానం యొక్క లక్ష్యాన్ని దర్శించడం.

అర్జునుడు: అజ్ఞాని యెవడు?

కృష్ణభగవాన్: పైన చెప్పినవాటికి తద్భిన్నంగా ఉండేవాడు.

* * *

పరబ్రహ్మాన్ని తెలుసుకుంటే ముక్తి లభించినట్లే.
ఆ పరబ్రహ్మం విభాగాలు లేనిది. వెలుగులకు వెలుగు అది.
అజ్ఞానమనే చీకటికావల ఉన్నది.
అందరి హృదయాలలో సిద్ధవస్తువుగా ఉన్నది.

ప్రకృతి-పురుషులిద్దరూ అనాది అని తెలుసుకో.
కార్యకారణాలకు కారణం - ప్రకృతి.
సుఖదుఃఖాలకు కారణం - పురుషుడు.
ఈ ఇద్దరి సంయోగమే జీవుని జన్మపరంపరకు కారణం.

ఆభరణంలో బంగారంలా, నశించేవాటిల్లో నశించని తత్త్వం ఉన్నది. ఆ తత్త్వాన్ని తెలుసుకున్నవాడే జ్ఞానదృష్టి కలవాడు.

అన్ని కర్మలూ ప్రకృతి వల్లనే జరుగుతున్నాయనీ, ఆత్మ అస్సలేమీ చేయదని తెలుసుకున్నవాడే జ్ఞానదృష్టి కలవాడు.

వేలు వేలు ప్రాణులుగా కనిపించినప్పటికీ అన్ని ఆభరణాల్లో ఉన్నది బంగారమే అన్నట్లు, అన్ని జీవుల్లోనూ ఉన్న ఆత్మను చూస్తున్నవాడే జ్ఞానదృష్టి కలవాడు.

కర్మకు, కర్మఫలానికి మలినపడని ఆత్మను తనలో దర్శించినవాడే జ్ఞానదృష్టి కలవాడు.

ఆకాశంలో సకలం ఉన్నప్పటికీ, సకలాన్ని అంటక ఆకాశం ఉన్నట్లు, ఆత్మ ఈ దేహాన్ని అంటక అలా ఉన్నది అని తెలుసుకున్నవాడు జ్ఞానదృష్టి కలవాడు.

అట్టి జ్ఞానదృష్టి కలవాడు పరమపదాన్ని చేరుకుంటాడు.

దేనిని తెలుసుకుంటే మనుషులు ఋషులవుతారో, అటువంటి ఉత్తమజ్ఞానాన్ని ఓ అర్జునా! నీకు మళ్లీ మళ్లీ చెప్పాలనిపిస్తోంది. అమృతమైనా వెగటు కలుగుతుందేమోగాని, ఈ జ్ఞానామృతాన్ని సేవించే కొద్దీ ఇంకా చెప్పాలనే, వినాలనే కోరిక పెరుగుతూనే ఉంటుంది. చెప్పేవాడికి, వినేవాడికి ఆ ఆధ్యాత్మిక సుఖం సమం. ఈ జ్ఞానం పొందినవాడు శాశ్వతవస్తువే తానైపోతాడు. ఇకవాడు సృష్టి జరిగినప్పుడు పుట్టడంగాని, ప్రళయం జరిగినప్పుడు నాశనం అవడంగాని ఉండవు. పుట్టుక-నాశనం అనేవి ఆభరణానికేగాని, బంగారానికి ఉండవు కదా!

మహత్తు అని, బ్రహ్మ అని పేర్లు కలిగిన మూలప్రకృతియే "జగద్యోని". ఆ యోనిలో చైతన్యమనే బీజాన్ని(జీవుణ్ణి) ఉంచుతున్నాను. తత్ఫలితంగా సమస్తభూతములు ఉత్పత్తి అవుతోంది. దేవ, మనుష్య, పశు, పక్ష్యాదుల లాంటి పలురకాలైన యోనులయందు పుట్టే పలురకాలైన శరీరాలకు ప్రకృతియే తల్లి. బీజప్రదాతయైన "నేనే"(పరమేశ్వరుడే) తండ్రి. అని తెలుసుకో.

* * *

కృష్ణభగవాన్: గుణాతీతుడు మాత్రమే పరబ్రహ్మస్వరూపాన్ని పొందగలడు.

అర్జునుడు: యెవడు గుణాతీతుడు?

కృష్ణభగవాన్: 1. ఉదాసీనంగా ఉండేవాడు.

2. త్రిగుణతత్త్వాన్ని తెలిసి, వాటికి తటస్థంగా ఉండేవాడు.

3. సుఖదుఃఖాలను సమభావంతో చూచేవాడు.

4. మట్టిని, రత్నాన్ని సమంగా ఎంచేవాడు.

5. ఇది ప్రియం, అది అప్రియం అనే తేడా లేనివాడు.

6. నిందను, స్తుతిని సమానంగా తీసుకునేవాడు.

7. సన్మానం, అవమానం రెంటికీ స్పందించనివాడు.

8. మిత్రుడు, శత్రువు ఇద్దరినీ సమానంగా చూచేవాడు.

9. కర్తృత్వబుద్ధితో కర్మలు చేయనివాడు.

10. అచంచలమైన భక్తితో నన్ను సేవించేవాడు.

గుణాతీతుడు.

నన్నే సేవించమని ఎందుకు చెబుతున్నానంటే- నాశరహితము, నిర్వికారము, శాశ్వతము, సచ్చిదానందస్వరూపము అయిన పరబ్రహ్మస్వరూపము "నేనే" కాబట్టి.

ఈ సృష్టి అనేది తిరగేసిన చెట్టు లాంటిది.

మొదలు(కారణం) పైన(పరబ్రహ్మంగా) ఉంటుంది.

శాఖలు(కార్యం) క్రింద(ప్రపంచంగా) ఉంటుంది.

"అసంగం" అనే ఆయుధంతో ఆ విచిత్రవృక్షాన్ని నరికి, ఎక్కడకు చేరుకుంటే, మళ్ళీ తిరిగి ఇక్కడకు రామో, ఆ స్థానానికి చేరుకోవాలి.

ఎవరి నుండి ఈ సృష్టికార్యం మొదలయ్యిందో, ఆ దివ్యపురుషుణ్ణయిన నన్ను శరణువేడు(అనగా నన్ను ఆశ్రయించు).

జగత్తుకు వెలుగునిచ్చే సూర్యచంద్రులలో, అగ్నిలో ఉన్న తేజస్సు ఏదో, అది "నా"దని తెలుసుకో.

"నేను" అందరిలో స్ఫురణరూపంగా ఉన్నాను.
జ్ఞాపకమూ నేనే, మఱపూ నేనే.
నన్ను ('నేను'ను) తెలుసుకున్నవాడు సర్వమూ తెలుసుకున్నవాడే.

అర్జునుడు: దైవాంశసంభూతుని లక్షణాలేవి?

కృష్ణభగవాన్: 1. భయం లేకపోవడం.

2. సాత్వికత.

3. జ్ఞానం.

4. దానం.

5. ఇంద్రియనిగ్రహం.

6. యజ్ఞం.

7. స్వాధ్యాయం.

8. తపస్సు.

9. నిజాయితీ.

10. అహింస.

11. సత్యం.

12. కోపం లేకపోవడం.

13. త్యాగం.

14. శాంతి.

15. చాడీలు చెప్పకపోవడం.

16. దయ.

19. విషయలోలత్వం లేకపోవడం.

20. చాపల్యం లేకపోవడం.

21. తేజస్సు కలిగి ఉండడం.

22. ఓర్మి.

23. పట్టుదల.

24. శుచిత్వం.

25. ద్రోహచింతన లేకపోవడం.

26. అభిమాన రాహిత్యం.

ఇదే దైవీసంపద.

ఈ లక్షణాలకు తద్భిన్నంగా ఎవరైనా ఉంటే, వారు అసురాంశసంభూతులు.

దైవీసంపద మోక్షకారణం.

అసుర సంపద బంధకారణం.

* * *

శాస్త్రం కోరికల్ని నియంత్రిస్తుంది.

కోరికల కారణంగా శాస్త్రాన్ని అతిక్రమించకూడదు.

శాస్త్రంలో ఉన్న ప్రకారం కర్మ చేయడం వలన పాపం రాదు.

శాస్త్రరీత్యా నీ కర్తవ్యం ఏమిటో నీకు తెలుసు.

అది చేయి చాలు.

ధర్మాన్ని ధర్మసూక్ష్మంతో ముడి పెట్టకు.

ధర్మం ఆచరణాత్మక విషయం.

ధర్మసూక్ష్మం ఆధ్యాత్మిక విషయం.

వెలుపల చేయల్సిన పనిని వెలుపల చేయి.

లోపల చేయాల్సిన పనిని లోపల చేయి.

వెలుపలున్న వ్యవహారాన్ని లోపలికి తేవద్దు.

లోపలున్న అనుభూతిని వెలుపలికి కక్కవద్దు.

కర్మ-జ్ఞానం ఈ రెంటివిషయంలో సమన్వయాన్ని సాధించడమే భగవద్గీత యొక్క ముఖ్యోద్దేశం.

అర్జునుడు: ఒకడు శాస్త్రవిధిని వదిలిపెట్టి, కేవలం శ్రద్ధ మాత్రమే కలిగి ఉంటాడు. అది చాలునా?

కృష్ణభగవాన్: శ్రద్ధ వల్లనే సకలమూ సమకూర్చబడుతుంది. కావున శ్రద్ధయే ప్రధమం. శాస్త్రవిధి ద్వితీయం.

శ్రద్ధ వల్లనే శాస్త్రం ఏర్పడింది. శాస్త్రం వలన శ్రద్ధ ఏర్పడదు. శ్రద్ధ లేకుండా చేసిన హోమమైనా, దానమైనా, తపస్సయినా మరి ఎటువంటి క్రియ అయినా దాని వలన ఇటు ఐహికంగాగాని, అటు పారమార్ధికంగాగాని ఎట్టి ప్రయోజనమూ ఉండదు.

అర్జునుడు: సన్న్యాసం-త్యాగం ఈ రెంటికీ తేడా ఏమి?

కృష్ణభగవాన్: నిజానికి రెండూ ఒక్కటే. శరీరం ఉన్నంత వఱకు కర్మలు చేయక తప్పదు. కాబట్టి కర్మలను వదిలే ప్రసక్తే లేదు. కర్తృత్వబుద్ధి లేకుండా, కర్మఫలాల మీద ఆసక్తి లేకుండా ఉండగలిగితే అదే సన్న్యాసం. అదే త్యాగము. కర్మలను వదిలేయాలనే ప్రయత్నం ఎలాంటిదంటే- రంగులరాట్నంలో కూర్చొనే, రంగులరాట్నాన్ని ఆపలని చేసే ప్రయత్నం లాంటిది.

నేను సన్న్యాసిని అనుకున్నా, నేను సంసారిని అనుకున్నా, నేను త్యాగిని అనుకున్నా, అన్నీ అహంకార ప్రకటితాలే.

'నేను ఇలా ఉండడం భగవదిచ్ఛ' అని తెలుసుకుని, నిరామయంగా (స్వ)కర్మలను ఆచరించేవాడే నిజమైన సన్న్యాసి. సన్న్యాసం అను, త్యాగం అను ఇవి మనసు యొక్క పరిపక్వతకు సంబంధించిన విషయాలు. అంటే అవి తన లోపలి విషయాలు. అంతేగాని, కుటుంబాన్ని, సంఘాన్ని విస్మరించడం సన్న్యాసం కాదు. దాని వలన సాధించేదేమీలేదు, తన మూర్ఖత్వాన్ని చాటుకోవడం తప్ప. తన అహాన్ని విస్మరించినవాడే నిజమైన సన్యాసి.

* * *

బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్య-శూద్రులు అనే వర్ణవ్యవస్థను తొలియుగంలో పరిణితి చెందిన మనుషులు(ఋషులు) కొందరు ఎంతో పరిశోధించి, మనుషుల భౌతిక, మానసిక(స్వభావ) స్థితులను అనుసరించి ఏర్పాటు చేసిన సాంఘీక కట్టుబాటు అది.

ఒకనిది ఏ కులమో తెలియని పరిస్థితి ఉన్నప్పుడు అతని ప్రధాన స్వభావాన్ని బట్టి కులాన్ని నిర్ధారించుకోవడం కద్దు. సత్యభాషణం కారణంగా సత్యకామజాబాలిని బ్రాహ్మణుగా నిర్ధారించాడు గౌతముడు.

(మిగతా వాళ్లంతా అబద్ధాలు చెప్పేవాళ్లా? అని విపరీతార్థం తీయకూడదు.)

సత్యభాషణం - బ్రాహ్మణుని ప్రధాన లక్షణం.
శౌర్యప్రతాపం - క్షత్రియుని ప్రధాన లక్షణం.
వ్యాపార కౌశలం - వైశ్యుని ప్రధాన లక్షణం.
శారీరకంగా శ్రమించడం - శూద్రుని ప్రధాన లక్షణం.

అనగా శూద్రులు పై మూడు కులాల వారికి అవసరమైన పనిముట్లను తయారుచేసి ఇస్తారు. వారికి చేదోడు వాదోడుగానూ ఉంటారు. అలా అని దానిని 'బానిసత్వం' అనే విపరీతార్థంలో

తీసుకోకూడదు. వీరికి ఇలా ఉండటమే ఇష్టం, సులభం. వారి వారి స్వభావాన్ని అనుసరించే మొదట్లో అలా కులధర్మాలు ఏర్పాడ్డాయేగాని, "అసమానతల" గొడవే లేదక్కడ.

ప్రక్కవారితో పోల్చి చూచుకోవడమే అజ్ఞానం.

తన(కుల)ధర్మమేదో తనకు తెలియకపోవడమే అజ్ఞానం.

అంతేగాని పరధర్మం తెలియకపోవడం అజ్ఞానం కాదు.

సహజమైన కర్మ (అనగా తనకు జన్మరీత్యా, స్వభావరీత్యా తనకు కేటాయించబడిన కర్మ) పైకి హీనంగా కనబడ్డా సరే స్వధర్మమే మేలు.

అర్జునా! ఎవరికి కేటాయించబడిన కర్మలు వారు ఆచరిస్తున్నప్పటికీ వాటి అన్నింటి లక్ష్యం "నన్ను" చేరుకోవడమే. అని తెలుసుకుంటే అదే 'జ్ఞానంతో కూడిన కర్మ' అంటే.

స్వధర్మానుష్ఠానంలో సదా ఉన్నవానిపై నా అనుగ్రహవర్షం సదా కురుస్తూనే ఉంటుంది.

కాబట్టి సర్వ(ఇతర) ధర్మాలను వదులు. అవన్నీ నీకు అవసరం లేదు. "నేను" ఒక్కణ్ణే పరమధర్మం అని తెలుసుకో. నన్నే శరణువేడు (నాకంటే అన్యం ఏమీ లేదు గనుక). నాకు శరణాగతి చెందటం అంటే, నీవు "నేనే" అయిపోవడమే, సముద్రంలో కలిసిన నది వలె. అప్పటి వరకూ ఉన్న నీ సర్వదోషాలూ హరింపబడతాయి. నీకూ, నాకూ మధ్య అభేదస్థితి ఏర్పడుతుంది. అదే మోక్షస్థితి. ఇక ఏ శోకానికీ అవకాశం ఉండదు.

అర్జునుడు: దేవా! మీ "ద్వారా" జ్ఞానగీతను విన్న నేను ధన్యుణ్ణి. నా మోహం పూర్తిగా తొలగిపోయింది. నేనెవరో నాకు తెలిసిపోయింది.

ఏకకాలంలో-

నేను కర్తను, అకర్తను కూడా.

నేను ఏమి చేసినా చేయనివాణ్ణే.

ధర్మాధర్మ సమతుల్యతను సాధించడానికి అవసరమైన ఈ యుద్ధభూమి వైపుకు రథాన్ని పోనీయ్!

(కృష్ణభగవానుని పెదవులపై చిరునవ్వు మెరిసింది.)

* * *

సంజయుడు: ధృతరాష్ట్ర మహారాజా! ఈ విధంగా మన కృష్ణార్జునుల మధ్య అద్భుతమైన సంవాదం జరిగింది. మహారాజా! కేవలం అర్జునుడు మాత్రమే కాదు నీవూ, నేనూ కూడా ఆ దివ్యసంవాదం విని తరించిపోయాం కాదంటారా?

ధృతరాష్ట్రుడు: అవును సంజయా! నిజమే. కళ్ళున్నా దర్శించలేని ఆ పరబ్రహ్మస్వరూపాన్ని కళ్లు లేకున్నా దర్శించగలిగాను. ధన్యుణ్ణి.

* * *